Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 | సంచిక : 67 | పేజీలు 8 | వెల : 5 | శుక్రవారం 29 ఆగష్టు 2025



ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| మల్టీకలర్ | బ్లాక్ & వైట్ పేజి |
|---|---|
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఫ్రంట్ పేజి : 30,000/- |

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.


## ఏపీలో వర్షాలు.. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి: మంత్రి అనిత



అమరావతి: బంగాళాఖాతంలో అల్పపీడనంతో ఏపీ వ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులతో హోంమంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. వివిధ జిల్లాల కలెక్టర్లతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. కృష్ణా పరివాహకంతో పాటు లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. సహాయక చర్యలకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. ప్రమాదకర హోర్డింగులు, కూలిన చెట్లను వెంటనే తొలగించాలన్నారు. విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి: మంత్రి గొట్టిపాటిమరోవైపు విద్యుత్ అధికారులతో ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

వర్షాలతో విద్యుత్ సమస్యలు ఎక్కడెక్కడ తలెత్తాయని ఆయన ఆరా తీశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఒకట్రెండు చోట్ల మినహా పెద్ద ఇబ్బందులు తలెత్తలేదని అధికారులు ఆయనకు తెలిపారు. ఉత్తరాంధ్రలో నీటి ప్రవాహం అధికంగా ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి తగిన జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విద్యుత్ ప్రమాదాలు తలెత్తకుండా ప్రజల్ని అప్రమత్తం చేయాలని అధికారులకు గొట్టిపాటి సూచించారు. వినాయక విగ్రహాల తరలింపు సమయంలోనూ సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.



# ఆధార్ తరహాలో ఫ్యామిలీ కార్డు

**కుటుంబ వివరాలు..పథకాల నమోదు**
**అందరికీ లబ్ధి కలిగేలా**
**పథకాల రీ డిజైన్**
**అధికారులతో ఉన్నతస్థాయి**
**సమీక్షలో సిఎం చంద్రబాబు**

అమరావతి: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ ఆధార్ తరహాలో 'ఫ్యామిలీ కార్డు' ఇవ్వాలని సిఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ కార్డులో ప్రభుత్వ పథకాలు సహా అన్ని వివరాలు పొందుపర్చాలని, ఎప్పటికప్పుడు వివరాలను అప్‌డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ అవసరాలపై క్షేత్రస్థాయి సమాచారం తీసుకోవాలి. ప్రభుత్వ సంక్షేమం అవసరమైతే వెంటనే అందేలా వ్యవస్థను సిద్ధం చేయాలి. ప్రభుత్వ పథకాల కోసం కుటుంబాలు విడిపోయే పరిస్థితి రాకూడదు. అందరికీ లబ్ధి కలిగేలా పథకాల రీడిజైన్ అంశం పరిశీలిద్దాం. త్వరలోనే పాపులేషన్ పాలసీ తీసుకురావాలని సీఎం చంద్రబాబు అన్నారు. ఫ్యామిలీ బెనిఫిట్ మానిటరింగ్ వ్యవస్థపై ఏపీ సీఎం చంద్రబాబు గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఫ్యామిలీ కార్డ్ జారీ చేయాలని సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ ఫ్యామిలీ కార్డు ఇవ్వాలని సీఎం చంద్రబాబు సూచించారు.. ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో సహా అన్ని వివరాలను ఫ్యామిలీ కార్డులో ఏపీ ప్రభుత్వం పొందుపరచనుంది. త్వరలోనే పాపులేషన్ పాలసీ తీసుకురావాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఏయే కుటుంబానికి ఏమేం అవసరాలున్నాయనే అంశాన్ని క్షేత్రస్థాయి నుంచి సమాచారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమం అవసరమైన వారికి వెంటనే అందేలా వ్యవస్థను సిద్ధం చేయాలని మార్గనిర్దేశర చేశారు. ప్రతి కుటుంబానికి ఇచ్చే ఫ్యామిలీ కార్డులో ప్రభుత్వం ఇచ్చే పథకాల వివరాలను పొందుపరచాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆధార్ తరహాలో ఫ్యామిలీ కార్డును ఉపయోగించుకోవాలని దిశానిర్దేశర చేశారు. అందరికీ లబ్ధి కలిగేలా అవసరమైతే పథకాలను రీ-డిజైన్ చేసే అంశాన్నీ పరిశీలిద్దామని సీఎం చెప్పుకొచ్చారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు పెరగాలని వాటిని ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని సూచించామని అన్నారు. ప్రభుత్వ పథకాల కోసం కార్డుల్లో ఫ్యామిలీలను విభజించుకుంటున్నారంటూ సీఎం వ్యాఖ్యానించారు. కుటుంబం ఉమ్మడిగా ఉన్న సంక్షేమం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందులో భాగంగానే ఫ్యామిలీ కార్డులకు రూపకల్పన చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## కొనసాగుతున్న అల్పపీడనం.. ఉత్తర కోస్తాకు భారీవర్ష సూచన

వాయవ్య బంగాళాఖాతం-ఒడిశా మధ్య అల్పపీడనం కొనసాగుతోంది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కోస్తాంధ్రకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. రాయలసీమ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా కదిలి బలహీనపడుతుందని అంచనా వేస్తున్నారు. ఉత్తర కోస్తాకు భారీ వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దక్షిణ కోస్తాలో ఒకట్రెండు చోట్ల భారీ వర్ష సూచన ఉంది. తీరం వెంట 35-45 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది.





2లో..

## ఉల్లి కొరత రాకుండా ముందే జాగ్రత్తలు

రైతుల నుంచి కొనుగోలు చేసి నిల్వ

అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు




2లో..

## బిజెపితో జగన్ అక్రమ పొత్తు

మైనార్టీలను మోసం చేస్తున్న బిజెపి, వైసిపి

పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ఘాటు వ్యాఖ్యలు



# వరద బాధితులను ఆదుకుంటాం

**పంట నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం**

**కేంద్రం నుంచి తక్షణ సాయం పొందేలా చర్యలు**

**వరద నష్టంపై వెంటనే నివేదికలు రూపొందించాలి**

**ఏరియల్ సర్వే అనంతనరం మెదక్‌లో సమీక్షించిన సిఎం రేవంత్**

మెదక్: వరదల్లో చిక్కుకొని మృతిచెందిన బాధిత కుటుంబాలకు, పంట నష్టపోయిన రైతులకు సహాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. పరిహారానికి సంబంధించి పూర్తి నివేదికలను సిద్ధం చేయాలని ఫోన్‌లో చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు ఇచ్చారు. వర్షాలు- వరదలపై మెదక్ ఎస్పీ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కేంద్రం నుంచి అత్యవసరంగా నిధులు కోరేలా రిపోర్ట్ తయారు చేయాలని జిల్లా అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. వరద తగ్గగానే పంట నష్టంపై క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక తయారు చేయాలని ఆజ్ఞాపించారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనాలను గుర్తించి, వాటిల్లో ఉన్న విద్యార్థులను వేరే చోటకు మార్చాలని సూచించారు. రామాయంపేట ఎస్సీ మహిళా డిగ్రీ కళాశాలకు పక్కా భవనం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదల్లో నష్టపోయిన వారిని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుం దని హామీనిచ్చారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క కూడా వరదలపై సమీక్షించారు. కామారెడ్డిలో జరిగింది ప్రకృతి విపత్తని, వర్షాలు తగ్గగానే పంట నష్టాన్ని అంచనా వేసి అందరినీ ఆందుకుంటామని అన్నారు. నష్టంపై సీఎంకు నివేదిక ఇస్తామని, కేంద్రం కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రెండు, మూడ్రోజుల్లో రవాణా మెరుగుపరుస్తామని మంత్రి సీతక్క తెలిపారు. కాగా, వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి బృందం పెద్దపల్లి, మెదక్ జిల్లాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. కామారెడ్డిలోనూ పర్యటించాల్సి ఉండగా.. చివరి నిమిషంలో పర్యటన రద్దు అయ్యింది.

## సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్

**20కి పెరగనున్న కోచ్‌ల సంఖ్య**

హైదరాబాద్: వందేభారత్‌కు లభిస్తున్న ఆదరణ నేపథ్యంలో రైల్వే బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. సికింద్రాబాద్–తిరుపతి సహా ఏడు మార్గాల్లో నడిచే వందేభారత్ రైళ్ల కోచ్‌ల సంఖ్యను పెంచాలని నిర్ణయించింది. దీంతో కోచ్‌ల సంఖ్య 20కి పెరగనుంది. సికింద్రాబాద్–తిరుపతి సహా మంగళూరు సెంట్రల్– తిరువనంతపురం, చెన్నై ఎగ్మోర్–తిరునల్వేలి మార్గాల్లో ప్రస్తుతం 16 కోచ్‌ల వందేభారత్ నడుస్తుండగా.. దీనిని 20 కోచ్‌లకు పెంచనున్నారు. మిగతా నాలుగు మార్గాల్లో ఎనిమిది కోచ్‌ల రైళ్లు నడుస్తుండగా.. వాటి స్థానంలో 16 కోచ్‌లు అందుబాటు–లోకి రానున్నాయి. ఈ ఏడు మార్గాల్లో కోచ్‌ల అప్‌గ్రేడ్‌తోపాటు– మరిన్ని 20 కోచ్‌ల వందేభారత్ రైళ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు. కొత్తగా వచ్చే 16, 8 కోచ్‌ల రైళ్లను కొత్త మార్గాల్లో ఉపయోగిస్తామన్నారు.

సికింద్రాబాద్–తిరుపతి, మంగళూరు సెంట్రల్– తిరువనంతపురం, చెన్నై ఎగ్మోర్–తిరునల్వేలి, మదురై–బెంగళూరు కంటోన్మెంట్, దేవ్‌గఢ్–వారణాసి, హవ్‌డా–రౌర్కెలా, ఇండోర్–నాగ్‌పూర్ మధ్య నడిచే వందేభారత్ రైళ్లలో ఎక్కువ కోచ్‌లు అందుబాటు–లో ఉండనున్నాయి.ప్రస్తుతం మూడు మార్గాల్లో 16 కోచ్‌లు, నాలుగు రూట్‌లలో ఎనిమిది కోచ్‌ల వందేభారత్ రైళ్లు నడుస్తున్నట్లు– అధికారులు వెల్లడించారు. 16 కోచ్‌ల రైలును 20 కోచ్‌లతో, ఎనిమిది కోచ్‌ల రైళ్ల స్థానంలో 16 కోచ్‌లకు అప్‌గ్రేడ్ చేయనున్నట్లు– రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రజా సంబంధాలు) దిలీప్ కుమార్ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో (జులై 31, 2025 నాటికి) వందేభారత్ రైళ్ల రద్దీ సమాచారాన్ని పరిగణనలోకి తీసుకొని వీటిని అందుబాటు–లో ఉంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

## విద్యాసంస్థలకు సెలవులు ప్రకటన

హైదరాబాద్:రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో 13 జిల్లాల్లో పాఠశాలలకు విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. నల్లగొండ, యాదాద్రి భువనగిరి, కరీంనగర్, సిద్దిపేట, జగిత్యాల, సిరిసిల్ల,కామారెడ్డి, మెదక్, నిర్మల్, ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు– విద్యాసంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయకు రాకూడదని అధికారులు సూచించారు. వర్ష ప్రభావం కారణంగా కామారెడ్డి జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు ఆగస్టు 29, 30 వరకు సెలవులు ప్రకటించినట్లు– ప్రభుత్వం తెలిపింది. భారీ వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సెలవులను మరో రెండు రోజులు పొడిగించింది. అందువల్ల పాఠశాలలు, కళాశాలలు బంద్ కానున్నాయి.సిద్దిపేట జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల ప్రభావంతో కామారెడ్డి, మెదక్ జిల్లాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

## కాకతీయ పరిధిలో పరీక్షలు వాయిదా

**డిగ్రీ, పిజి పరీక్షలు వాయిదా వేస్తూ ప్రకటన**

వరంగల్: పలు జిల్లాల్లో ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో ఆగస్టు 28, 29 తేదీల్లో జరగాల్సిన డిగ్రీ, పీజీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు– రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాజేందర్ ప్రకటించారు. వర్షాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, మిగిలిన పరీక్షలు షెడ్యూల్ ప్రకారం యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. వాయిదా వేసిన పరీక్షల కొత్త తేదీలను త్వరలో ప్రకటిస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా, కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గురువారం జరగాల్సిన బీఎడ్, ఎంఎడ్ పరీక్షలు కూడా వాయిదా పడ్డాయి. వర్షాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. మిగతా పరీక్షలు యథావిధిగా జరుగుతాయని స్పష్టంచేశారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మోడల్ స్కూల్స్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు– పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి ఆరు నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షలు నిర్వహించినా, ఇంకా సుమారు 48,630 సీట్లు– ఖాళీగా ఉన్నట్లు– గుర్తించామని ఆయన వెల్లడించారు.

ఇంటర్ రెండో సంవత్సరం 13,256 సీట్లు–, ఇంటర్ ఫస్ట్ ఇయర్ 12,668 సీట్లు–, ఆరో తరగతి 7,543 సీట్లు–, ఏడో తరగతి 5,192 సీట్లు–, ఎనిమిదో తరగతి 3,936 సీట్లు–, తొమ్మిదో తరగతి 2,884 సీట్లు–, పదో తరగతి 3,151 సీట్లు– ఖాళీగా ఉన్నట్లు– వివరించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు నేరుగా సంబంధిత మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌ను సంప్రదించి అడ్మిషన్లు పొందవచ్చని సూచించారు.

## వర్ష నష్టాలపై ప్రాథమిక అంచనా వేయండి



హైదరాబాద్: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావు సంబంధిత శాఖల కార్యదర్శులను ఆదేశించారు. రాష్ట్రంలో గత కొద్దీ రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలవలన జరిగిన నష్టాలపై వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, వికాస్ రాజ్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు రాహుల్ బొజ్జ, రఘునందన్ రావు, శ్రీధర్ , పోలీస్ శాఖ ఉప మరియు అడిషనల్ డీజీ మహేష్ భగవత్ తదితర ఉన్నతాధికారులు ఈ టెలీ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రధానంగా నిర్మల్, కామారెడ్డి, మెదక్, సిరిసిల్ల జిల్లాలు అధికంగా నష్టాన్ని చవి చూశాయని, వీటితో పాటు– ఇతర జిల్లాల్లో కూడా గణనీయమైన నష్టం వాటిల్లిందని అన్నారు.

ఈ నష్టాలకు సంబంధించి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలన్నారు. ఈ ప్రాథమిక నివేదికలతో పాటు– జరిగిన నష్టాలను తెలియచేసే ఫోటోలు,వీడియో క్లిప్పింగులు, పత్రిక క్లిప్పింగులు కూడా జతపర్చాలని సి.ఎస్ పేర్కొన్నారు. వివిధ శాఖల కార్యదర్శులు, సంబంధిత జిల్లా కలెక్టర్లు నష్టాలపై పంపిన ఈ ప్రాథమిక నివేదికలను సంకలనం చేయాలని విపత్తుల నిర్వహణ శాఖ కు తెలిపారు. ఇప్పటికే పలు జిల్లాల్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, విద్యుత్ లైన్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్దరించాలని రామకృష్ణారావు ఆదేశించారు. వర్షాలు మరికొన్ని రోజులు వచ్చే అవకాశం ఉన్నందున మరింత అప్రమత్తతతో ఉండాలని స్పష్టం చేశారు. దురదృష్టవశాత్తు మరణించిన వారి కుటు–ంబాలకు నిబంధనలను అనుసరించి ఎక్స్ గ్రేషియా ను అందచేయాలని అన్నారు.గౌరవ ముఖ్యమంత్రివర్యులు పూర్తి స్థాయిలో సమీక్షించనున్నందున సంబంధిత శాఖలన్ని వివరాలతో, తీసుకున్న చర్యల నివేదికలతో సిద్ధంగా ఉండాలని కోరారు.

# వరద బాధితులను ఆదుకుంటాం



మెదక్: వరదల్లో చిక్కుకొని మృతిచెందిన బాధిత కుటుంబాలకు, పంట నష్టపోయిన రైతులకు సహాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. పరిహారానికి సంబంధించి పూర్తి నివేదికలను సిద్ధం చేయాలని ఫోన్‌లో చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు ఇచ్చారు. వర్షాలు– వరదలపై మెదక్ ఎస్పీ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కేంద్రం నుంచి అత్యవసరంగా నిధులు కోరేలా రిపోర్ట్ తయారు చేయాలని జిల్లా అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. వరద తగ్గగానే పంట నష్టంపై క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక తయారు చేయాలని ఆజ్ఞాపించారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనాలను గుర్తించి, వాటిల్లో ఉన్న విద్యార్థులను వేరే చోటకు మార్చాలని సూచించారు. రామాయంపేట ఎస్సీ మహిళా డిగ్రీ కళాశాలకు పక్కా భవనం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదల్లో నష్టపోయిన వారిని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుం దని హామీనిచ్చారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క కూడా వరదలపై సమీక్షించారు. కామారెడ్డిలో జరిగింది ప్రకృతి విపత్తని, వర్షాలు తగ్గగానే పంట నష్టాన్ని అంచనా వేసి అందరినీ ఆందుకుంటామని అన్నారు. నష్టంపై సీఎంకు నివేదిక ఇస్తామని, కేంద్రం కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రెండు, మూడ్రోజుల్లో రవాణా మెరుగుపరుస్తామని మంత్రి సీతక్క తెలిపారు. కాగా, వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి బృందం పెద్దపల్లి, మెదక్ జిల్లాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. కామారెడ్డిలోనూ పర్యటించాల్సి ఉండగా.. చివరి నిమిషంలో పర్యటన రద్దు అయ్యింది.

# క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ దికగా మారాలి



హైదరాబాద్: క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ దికగా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తెలంగాణకు ఐటీ– సంస్కృతి ఉందని... రాష్ట్రంలోని ప్రతి కుటుంబం తమపిల్లలు ఐటీ–రంగంలో ఉండాలనికోరుకుంటున్నారని... అలానే క్రీడా సంస్కృతి రావాలని తాను అభిలషిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఖేలో ఇండియా, కామన్ వెల్త్, ఒలింపిక్స్ ఇలా ఏ పోటీలు నిర్వహించినా వాటిలో తెలంగాణకు అవకాశంకల్పించాలని తెలంగాణ స్పోర్ట్స్ హబ్ తీర్మానం చేసింది. రాష్ట్రంలో స్టేడియాల నిర్వహణ, వసతులు మెరుగుపర్చడం, కోచ్‌లు, –ట్రైనర్‌లకుశిక్షణ, క్రీడా పాలసీలో వివిధ అంశాలపై ప్రణాళికరూపకల్పన, అమలుకు సబ్‌మిటీల ఏర్పాటుకు బోర్డు తీర్మానాలు చేసింది. తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు మొదటి సమావేశం హైదరాబాద్‌లో గురువారం జరిగింది. సమావేశంలోముఖ్యమంత్రి రేవంత రెడ్డి మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా విధానం, క్రీడల ప్రోత్సాహం విషయంలో ప్రతిఒక్కరూ హైదరాబాద్ గురించి మాట్లాడుకోవాలనేదే తన లక్ష్యమన్నారు. క్రీడా రంగం ప్రోత్సాహానికి గానూ గతంతో పోల్చితే 16రెట్లు–బడ్జెట్ పెంచామని సీఎం వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు– ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని సీఎం తెలిపారు. క్రీడా రంగం ప్రాధాన్యతను పెంచేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు–చేశామన్నారు. హైదరాబాద్‌తో పాటు–తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున స్టేడియాలు, అధునాతనపరికరాలు అందుబాటులో ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలులేవని, వాటిని సమగ్రంగా సద్వినియోగం చేసుకోవడం తో పాటు క్రీడా రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు బోర్డు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం కోరారు. క్రీడా రంగం అభివృద్ధికి నిధులు, నిపుణులు, నిర్వహణ అవసరమైనందునే బోర్డులో ప్రముఖ కార్పొరేట్లు–, క్రీడాకారులు, క్రీడా నిర్వాహకులకు చోటు– కల్పించామని సీఎం తెలిపారు. ఇప్పటివరకు ఉన్న క్రీడా పోటీల విధానాన్ని మార్చుతూ గ్రామ, మండల, శాసనసభ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. శాసనసభనియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్ల మధ్య పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించి అంతిమంగా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి జట్లను ఎంపిక చేస్తామన్నారు.. క్రీడా సామగ్రిపై ఉన్న పన్నుల తగ్గింపునకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని... తమ స్థాయిలో అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలోఫిజియోథెరపీ, ఇతర క్రీడా సంబంధిత కోర్సులు ప్రవేశపెడతామని బోర్డు సభ్యులకు తెలియజేశారు. స్టేడియాలు పెద్ద సంఖ్యలో ఉన్నా తగిన సంఖ్యలో కోచ్‌లు లేరని, ఉన్న కోచ్‌లకుఅంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకుతగినట్లు శిక్షణ ఇప్పించాల్సి ఉందన్నారు. రానున్న మూడేళ్లలో మనం సాధించాల్సిన లక్ష్యాలపై బోర్డు తగిన కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు.

ఇండియా క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ మాట్లాడుతూ తొలుత క్రీడా సంస్కృతిని పెంపొందిం చాలని... ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలోపాల్గొనేలా చూస్తే ఫలితాలు వాటంతటవే వస్తాయని అభిప్రాయపడ్డారు. హర్యానాలో కుస్తీతో ప్రతిక్రీడకుపల్లెల్లో చోటు ఉందని ఆయన గుర్తు చేశారు. ప్రముఖ షూటర్ అభినవ్ భింద్రా మాట్లాడుతూ ప్రతిపాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు, వ్యాయామ సంచాలకుడు ఉండేలా చూడాలన్నారు. ఆధాని ఫౌండేషన్ శతాధానీ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని... వ్యాయామ అక్షరాస్యత పై అవగాహన పెంపొందించాల్సి ఉందన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి క్రీడా పోటీలు దశలవారీగా ఉండాలని.. అప్పుడు మెరుగైన క్రీడాకారుల ఎంపిక సాధ్యమవుతుందన్నారు. హబ్ కో ఛైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల మాట్లాడుతూ ఫిజియోథెరపిస్టు కోర్సులను క్రీడా యూనివర్సిటీలోప్రారంభించాలని కోరారు. అలాగే స్పోర్ట్స్ సామగ్రిపై పన్నుల భారం భారీగా ఉందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

హబ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ సంజీవ్ గోయెంకా మాట్లాడుతూ ప్రపంచ ప్రముఖ కంపెనీల సీఈవోలు ఈ ప్రాంతం నుంచే ఉన్నందున వారి సేవలను క్రీడాభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. విశ్వ సముద్రఫౌండేషన్ చింతా శశిధర్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి అవసరమైనసామగ్రిని పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచితే మరింత మెరుగైన ఫలితాలువస్తాయన్నారు. క్రీడా నిర్వాహకులు బియ్యాల పాపారావు మాట్లాడుతూ ఐఐటీ– ప్రొఫెసర్లు మాదిరి స్పోర్ట్స్ యూనివర్సిటీలో కోచ్‌లు ఉండాలన్నారు. ఫుట్ బాల్ టీ–మ్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భాటియా మాట్లాడుతూ గ్రామ స్థాయిలో స్టేడియాలు, క్రీడా సామగ్రి అందుబాటు–లో ఉండే క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు. ఇంగ్లాండ్‌లో ప్రతిఆటకు లీగ్స్ ఉంటాయని...అలాగే మన దగ్గర ప్రతిఆటకు లీగ్స్ ఉండాలన్నారు. ప్రముఖ క్రీడాకారుడు రవికాంత్ రెడ్డి మాట్లాడుతూ మనకు ఉన్న స్టేడియాలనుమెరుగ్గావినియోగించుకోవాలని, వాటి నిర్వహణసక్రమంగాచేయాలన్నారు.

సమావేశంలో క్రీడా వ్యవహారాల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వప్రత్యేక ముఖ్య కార్యదర్శిజయేశ్రంజన్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ– ఛైర్మన్శివసేనా రెడ్డి, ఎండీ సోని బాల దేవి తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి వరద ప్రాంతాల్లో మంత్రి సీతక్క పర్యటన

**స్థానిక ప్రజలతో మాట్లాడి పరిస్థితి సమీక్ష**

**బాధితులకు తక్షణ సాయం అందించాలని ఆదేశం**



కామారెడ్డి: జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని సదుపాయాలు కల్పించాలని అన్నారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, మంచినీరు, వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉంచాలని, అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉండి ప్రతి కుటుంబానికి అవసరమైన సాయం అందించాలన్నారు. ఈ పర్యటనలో ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. వరుసగా కురుస్తున్న అధిక వర్షాల కారణంగా ముంపునకు గురైన కామారెడ్డి పట్టణంలోని జి.ఆర్ కాలనీని మంత్రి స్వయంగా పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో రవాణా అంతరాయాలు, విద్యుత్ సమస్యలు, త్రాగునీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. సహాయక చర్యలు నిరంతరంగా కొనసాగుతాయన్నారు. ప్రభుత్వం, అధికారుల అప్రమత్తత వల్ల ప్రాణనష్టాన్ని నివారించగలిగామని, వరద ముంపులో చిక్కుకున్న చాలామందిని రక్షించామనిసీఎం గారు వర్షాలు వరదల మీద వరుస సమీక్షలు నిర్వహిస్తూ మంత్రులను, అధికార యంత్రాంగాన్ని గైడ్ చేస్తున్నారన్నారు. అర్ధరాత్రి అకస్మాత్తుగా క్లౌడ్ బరస్ట్ జరగటం వల్ల వరద ఉధృతి పెరిగిందని, వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని అంచనావేస్తున్నామని బాధితులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటు–ందన్నారు. ప్రభుత్వం వరద బాధితులకు స్థానిక అధికారుల ద్వారా ఆహారాన్ని సరఫరా చేస్తున్నామని ప్రకృతి విపత్తుల సమయంలో రాజకీయాలు చేయకుండా ఎవరికి తోచినట్టు–గా వారు బాధితులకు అండగా ఉండాలని, లోతట్టు–ప్రాంతాల ప్రజలు దయచేసి పునరావాస కేంద్రాల్లోకి వెళ్లాలని కోరారు. ఎలాంటి విపత్కాల పరిస్థితులు తలెత్తిన ఎదుర్కునేందుకు ప్రభుత్వ యంత్రాంగమంతా సిద్ధంగా ఉందన్నారు.

## భారీ వర్షాలతో పలుచోట్ల రోడ్లకు గండ్లు

హైదరాబాద్: భారీ వర్షాలతో పలుచోట్ల రోడ్లకు గండ్లు పడ్డందున, రోడ్లు దెబ్బతిన్న ప్రాంతంలో హెచ్చరిక బోర్టులు ఏర్పాటు చేయాలని, తక్షణ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించచారు. రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆర్ అండ్ బి అధికారులను అలెర్ట్ గా ఉండాలని ఆదేశించారు. గురువారం నాడు ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయి పరిస్థితులను ఆర్ అండ్ బి శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల్లో పరిస్థితులపై సమీక్షించిన మంత్రి, కాజ్ వే లు, కల్వర్టులు, బ్రిడ్జిలు, కోతకు గురైన రోడ్ల వివరాలు అధికారులను అడిగితెలుసుకున్నారు. కామారెడ్డి, నిర్మల్ వద్ద వరద ప్రవాహానికి కఐ 44 పై రాకపోకలకు ఏర్పడిన అంతరాయం, ట్రాఫిక్ క్లియరెన్స్ పై మంత్రి ఆరా తీసి..

నేషనల్, స్టేట్ హైవేల స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు ఈ సీజన్ లో అధిక వర్షాల వల్ల పాడైన రోడ్లు, కల్వర్టుల, ముఖ్యంగా ఇంకా రెడ్ అలెర్ట్ ఉన్న జిల్లాల రోడ్ల వివరాలు అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రోడ్లు తెగిన చోట, కల్వర్టులు పొంగిపొర్లుతున్న చోట, వాగులు ఉధృతంగా ప్రవహించే మైనర్ బ్రిడ్జిల వద్ద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు– చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా చూడాలని, తెగిన రోడ్లు, కల్వర్టుల వద్ద వర్షాలు తగ్గుముఖం పట్టగానే తాత్కాలిక మరమ్మతులు చేపడతామన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు చేయాలని అధికారులకు సూచించారు. ప్రాణ నష్టం జరగకుండా పోలీస్, ఎలక్ట్రిసిటీ–, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. డైన రోడ్లు, వంతెనలకు సంబంధించి శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఆర్ అండ్ బి హెడ్ ఆఫీస్ లో కంట్రోల్ సెంటర్ కు వస్తున్న ఫిర్యాదులు, సమాచార వివరాలపై మంత్రి ఆరా తీయగా.. స్టేట్ రోడ్స్ సి.ఈ ఆధ్వర్యంలో షిఫ్టుకు నలుగురు చొప్పున 24 గంటలు మానిటరింగ్ చేస్తున్నట్లు– చెప్పారు. మంత్రి గత రివ్యూలో చెప్పిన ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 37 ఆర్ అండ్ బి డివిజన్ల నుండి వివరాలు సేకరణ చేస్తున్నామని, 24 గంటలు అలెర్ట్ గా ఉంటు–న్నామని స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ మంత్రికి తెలిపారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వచ్చిన వరద ప్రవాహాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు ఆర్ అండ్ బి పరిధిలోని 37డివిజన్లలో 794 చోట్ల సమస్యాత్మక రోడ్లు గుర్తించామని,అందులో 1039 కి.మీ రోడ్డు దెబ్బతిందని, 31 చోట్ల రోడ్డు తెగిపోతే వెంటనే 10 చోట్ల తాత్కాలిక పునరుద్ధరణ చేశామని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఆర్ అండ్ బి) మంత్రికి వివరించారు. 356 చోట్లలో కాజ్ వే లు,కల్వర్టులు వరద ప్రవాహం ఉంటే అందులో 289 దారి మళ్లింపు చేసినట్లు– పేర్కొన్నారు. రాకపోకలకు ఇబ్బంది ఉన్న 305 ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన 236చోట్ల క్లియర్ చేశామని,మిగతా చోట్ల వేగంగా క్లియర్ చేస్తున్నామని అన్నారు. మొత్తంగా 206 చోట్ల సిడి వర్క్స్ దెబ్బతిన్నాయని, రోడ్లు, కాజ్ వే,మైనర్ బ్రిడ్జి లు, కల్వర్టులు తాత్కాలికంగా, శాశ్వతంగా పునరుద్ధరించాలని ప్రాథమికంగా గుర్తించినట్లు– పేర్కొన్నారు. తాత్కాలిక పునరుద్ధరణకు 53.76 కోట్లు– వరకు ఖర్చు అవుతుందని, శాశ్వత పునరుద్ధరణ కోసం 1157.46 కోట్లు– అవసరమవుతాయని అంచనా వేసినట్లు– పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆర్ అండ్ బి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన చర్యలు, క్షేత్ర స్థాయిలో చూపిన పని తీరును అభినందించిన మంత్రి, అలసత్వం వహించకుండా.. అదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.?? రాష్ట్ర స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఆర్ అండ్ బి ఇంజనీర్లు అధిక వర్షాలు ఉన్న ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేస్తూ..పరిస్థితులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని, ఏ రోజుకు ఆరోజు వివరాలు ఉదయం, సాయంత్రం తనకు రిపోర్ట్ చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

## ఉల్లి కొరత రాకుండా ముందే జాగ్రత్తలు

అమరావతి:ఉల్లి పంటను తక్షణమే కొనుగోలు చేసి నిల్వ చేయాలని ముఖ్యమం÷–తరి చంద్రబాబు నాయుడు సూచించారు. కమ్యూనిటీ–హాళ్లను అద్దెకు తీసుకుని ఉల్లిని ఆరబెట్టాలని ఆదేశాలు జారీ చేశారు.రైతుల నుంచి ఉల్లి కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, మార్కెటింగ్ విభాగం అధికారులు హాజరయ్యారు. రైతుల నుంచి క్వింటాకు రూ.1200 చొప్పున ఉల్లిని కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఉల్లికి రేటు వచ్చే వరకూ కమ్యూనిటీ– హాళ్లల్లో నిల్వ చేయడానికి రైతులకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. వచ్చే పది రోజుల్లో ఐదువేల మెట్రిక్ టన్నుల ఉల్లి పంట వస్తుందని అధికారులు వివరించారు. కొనుగోలు చేసి ఆరబెట్టిన ఉల్లిని రైతు బజార్లల్లో విక్రయించేలా చర్యలు చేపట్టాలని దిశానిర్దేశర చేశారు. తక్షణం ఉల్లిని కొనుగోలు చేసి రైతులకు నష్టం రాకుండా చూడాలని ఆదేశించారు. అన్ని పంటల ధరల స్థిరీకరణ కోసం వేర్ హౌసింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. రైతుబజార్ల సంఖ్యను పెంచటంతో పాటు–ఆధునీకికరణకు వెంటనే చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశర చేశారు సీఎం చంద్రబాబు. మరోవైపు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో పలు కీలక అశాలపై చర్చించారు. ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలకు ప్రోత్సాహకాల ప్రతిపాదనలు, పరిశ్రమల కోసం ఏపీఐఐసీ ప్రతిపాదనలు, ప్రైవేటు–పార్కులు, ఎంఎస్ఎంఈ పార్కులు ప్రతిపాదనలపై సీఎం చంద్రబాబు చర్చించారు. ప్రైవేటు మెగా ఇండస్ట్రియల్ పార్కులు, టూరిజం శాఖ ప్రతిపాదనలు, విద్యుత్ శాఖ ప్రతిపాదనలపై మాట్లాడారు. ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ శాఖ ప్రతిపాదనలకు పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో చర్చించి ఆమోదం తెలిపామని అన్నారు. ఎస్ఐపీబీ ప్రతిపాదనలకు ఆమోదం తెలపడం ద్వారా రూ. 53,922 కోట్ల పెట్టుబడులతో 83,437 మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని వివరించారు.

## బిజెపితో జగన్ అక్రమ పొత్తు

విజయవాడ: వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డిది బీజేపీతో అక్రమ పొత్తు అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్ బీజేపీకి దత్తపుత్రుడని విమర్శించారు. గురువారం విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏపీసీసీ మైనార్టీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా షర్మిల పాల్గొని మాట్లాడారు. సెక్యులర్ పార్టీ ముసుగులో మైనారిటీలను టీడీపీ, వైసీపీలు మోసం చేస్తున్నాయని ఆరోపించారు. మైనారిటీ–ల ప్రయోజనాలు దెబ్బతీసే అన్ని బిల్లులకు మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ కొడుకు అయ్యి ఉండి ముస్లింలకు వ్యతిరేకంగా ఉన్న బిల్లులకు జగన్ మద్దతు ఇవ్వడం దారుణమని మండిపడ్డారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీలు మైనారిటీ–లను ఉద్ధరించింది శూన్యమని విమర్శించారు వైఎస్ షర్మిల.గత పదేళ్లుగా ఇచ్చిన ఒక్క హామీని కూడా మోదీ ప్రభుత్వం ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. చంద్రబాబు, జగన్ ఇద్దరు మైనారిటీ–ల పట్ల ద్రోహులేనని విమర్శించారు. 45, 50 ఏళ్లకే పెన్షన్లు ఇస్తామని మోసం చేశారని ఆరోపించారు. ముస్లింలకు ఇస్లామిక్ బ్యాంక్ అని మోసం చేశారని షాకింగ్ కామెంట్స్ చేశారు షర్మిల. మతతత్వ బీజేపీ పాలనలో మైనార్టీలకు రక్షణ లేదని ఆరోపించారు. మైనారిటీ– హక్కుల పట్ల బీజేపీకి విలువ లేదని విమర్శించారు. హిందూ – ముస్లిం భాయి భాయి అనేది కాంగ్రెస్ సిద్ధాంతమని ఉద్ఘాటించారు. హిందూ – ముస్లిం, క్రిస్టియన్

ఉత్తేజిత దినపత్రిక





## ఎమ్మిగనూరు పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై మున్సిపల్ కమిషనర్, డీఈ, ఏఈలతో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి

ఎమ్మిగనూరు ఆగస్టు 28 గురువారం ఎమ్మెల్య బీవీ జయ నాగేశ్వర్ రెడ్డిచిరువ్యాపారుల మున్సిపల్ షాపులపై చర్చించి, వారి వ్యాపారాలు సజావుగా సాగేందుకు అవసరమైన సూచనలు ఇచ్చారు. చిరువ్యాపారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వైన్ షాప్ ను వేరే చోటికి మార్చండి. PDSU,TUCI (ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా).

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి



ఎమ్మిగనూరు ఆగస్టు 28 గురువారం పట్టణంలో కూరగాయలు మార్కెట్ దగ్గర నిత్యం రద్దీ ప్రాంతం లో వైన్ షాప్ ఏర్పాటు చేస్తున్నారు అక్కడ మార్కెట్ కు మహిళలు,అక్కడ విద్యాసంస్థలు కూడా ఉన్నాయి నిరంతరం ప్రజలు తిరుగుతుంటారు అక్కడ వైన్ షాప్ పెడితే నిత్యం మహిళలకు,మరియు విద్యార్థినులకు, వాహన దారులకు ,చిన్న వ్యాపార్థస్తులు మందు బాబులు బెడద ఏర్పడుతుంది అని ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకొని మరోచోటికి తరలించాలని %ూణూఖ% రాష్ట్ర కార్యదర్శి రాజేష్,%ఞఖజ×% జిల్లా నాయకులు మాణిక్యం, ఎక్చేంజ్ సీఐ గారికి వినతిపత్రం ద్వారా తెలియజేయడం జరిగింది .ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో కూరగాయల మార్కెట్ ఇరుకు రోడ్లు నిత్యం రద్దీ ప్రాంతం అందులో మహిళలు మార్కెట్ కు మరియు విద్యార్థులను పాఠశాలకు వెళ్ళే ప్రాంతం అక్కడ వైన్ షాప్ ఏర్పాటు చేయడం వలన మందుబాబులు అక్కడే మద్యం సేవించి మహిళల పట్ల అసభ్యకరం ప్రవర్తిస్తారు అందులో వాహనదారులకు కూడా ఇబ్బందులు పడుతారు ట్రాఫిక్ కు అంతరయం కలుగుతుంది అన్నారు ఇప్పటికీ పట్టణంలో చాలా వరకు జనసీవాసాల మద్యలో వైన్ షాపులు ఉన్నాయి అని అన్నారు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రజాభిప్రాయం మేరకు వైన్ షాప్ ను మరొకచోటికి మార్చే ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ పట్టణ నాయకులు స్వామి,ఈశ్వర్, అభి, టీయూసీఐ నాయకులు అబ్దుల్ భాష,వెంకటేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సంస్కరణలు పేరుతో అమలు

2000 ఆగస్టు 28 హైదరాబాద్ బషీర్బాగ్ లో పోలీస్ కాల్పులలో మరణించిన కామ్రేడ్ విష్ణువర్ధన్ రెడ్డి ,రామకృష్ణ, బాలస్వామి లకు నివాళులర్పిస్తూ,నేడు కూటమి ప్రభుత్వం

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి




ఎమ్మిగనూరు ఆగస్టు 28 గురువారం పట్టణంలో విద్యుత్ సంస్కరణలు పేరుతో అమలు చేస్తున్న ట్రూ ఆఫ్ చార్జీలు,స్మార్ట్ మీటర్ లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ఎమ్మిగనూరు పట్టణంలో వామపక్ష పార్టీల(CPI ,CPM,CPI ML న్యూ డెమోక్రసీ)ఆధ్వర్యంలో నిరసన తెలిపి ప్రతిజ్ఞ చేయడం జరిగింది

## ఎమ్మిగనూరు నియోజకవర్గంలో వినాయక చవితి వేడుకలు అట్టహాసం

కర్నూలు జిల్లాఉత్తేజిత ప్రతినిధి




ప్రారంభమయ్యాయి.
ఎమ్మిగనూరు ఆగస్టు 28 ఊ పట్టణంలోని వార్డుల్లో ప్రతిష్ఠించిన విగ్రహాల వద్దకు వెళ్లి ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయనాగేశ్వర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలు తలపెట్టిన ప్రతి కార్యం ఆ గణనాథుని ఆశీస్సులతో విజయం చేకూరాలని ప్రార్థించారు.

## లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాడుదాం

సి. బెళగల్ ఉత్తేజిత న్యూస్



ఆగస్టు 28 కేంద్ర ప్రభుత్వం బ్రిటిష్ కాలంలో కార్మికులు తమ హక్కుల కోసం పోరాటం చేసి 44 రకాల కార్మిక హక్కులను,చట్టాలను సాధించుకున్నారని, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వాటిని రద్దుచేసి కేవలం నాలుగు లేబర్ కోడ్లను అమలు చేసి కార్మికులను కట్టు బానిసలుగా చేయడానికి చూస్తుందని, లేబర్ కోడ్ల వలన కార్మికులు తమ హక్కులను కోల్పోతారని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, మోహన్ అన్నారు. గురువారం సి.బెళగల్ మండల కేంద్రంలోని ఎన్టీఆర్ పార్కు నందు సిఐటియు మండల సభ నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారం వచ్చినప్పుడు నుండి దేశంలోని అన్ని ప్రభుత్వ రంగాలను, అదాని, అంబానీ లాంటి బడా కార్పొరేట్ పెట్టుబడిదారులకు ప్రైవేట్పరం చేయడానికి కార్మిక చట్టాలు అడ్డుగా ఉన్నాయని, కేంద్రం వాటిని రద్దు చేయడానికి ప్రయత్నిస్తుందని, అందులో భాగంగానే 44 రకాల కార్మిక చట్టాలను రద్దుచేసి, కేవలం నాలుగు లేబర్ కోట్లను అమలు చేసి కార్మికులను కట్టు బానిసలుగా చేయడానికి కేంద్ర ప్రభుత్వం చూస్తుందని వారు తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని తెలిపారు. సిఐటియు మండల నూతన కమిటీ ఎన్నిక: సి.బెళగల్ మండల కేంద్రంలో నూతన కమిటీలను ఎన్నుకోవడం జరిగిందని సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్ అన్నారు. సి.బెళగల్ సిఐటియు మండల కమిటీ కన్వీనర్ గా ఎస్. ఇబ్రహీం, ఓ కన్వీనర్లుగా మంగమ్మ, అనంతమ్మ, సుంకన్న, సుందరాజు, వెంకట రాముడు తదితరులు ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఆశా కార్యకర్తలు, హమాలి సంఘం నాయకులు, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాబు షూరిటీ మోసం గ్యారెంటీ" నినాదంతో టీడీపీ కూటమి మోసాలపై ""ఇంటింటికి రికాల్ టీడీపీ మ్యానిఫెస్టో" కార్యక్రమం

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి



ఎమ్మిగనూరు ఆగస్టు 28 గురువారం నందవరం, ఆగస్టు 28: రాష్ట్ర ప్రజలకు ఎన్నో హామీలు ఇస్తూ అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకపోవడం వల్ల ప్రజల్లో నిరాశ మరియు ఆగ్రహం నెలకొంది. ఈ నేపథ్యంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అవగాహన కల్పించడానికి "ఇంటింటికి రికాల్ టీడీపీ మ్యానిఫెస్టో" అనే ప్రత్యేక నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమం ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి బుట్టా రేణుక గారి ఆదేశాల మేరకు, నందవరం మండలంలోని గురుజాల,రాయిచోటీ గ్రామలలో మండల పార్టీ అధ్యక్షులు జే. శివారెడ్డి గారి అధ్యక్షతన గురుజాల,రాయచోటి గ్రామ పంచాయతీ నాయకుల,కార్యకర్తల ఆధ్వర్యంలో జరిగింది.టీడీపీ కూటమి పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన 140 పైగా హామీలు, సూపర్ సిక్స్ వాగ్దానాలు అమలు కాలేదని వైసీపీ నాయకులు ప్రజలకు వివరించారు. రైతుల అప్పు మాఫీ, నిరుద్యోగ భృతి, విద్యార్థుల కోసం సరైన సదుపాయాలు వంటి అనేక హామీలు మాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు. అభివృద్ధి పేరుతో కేవలం ప్రకటనల పాలన కొనసాగిందని, పేదలు, రైతులు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందని వారు స్పష్టం చేశారు.మండల పార్టీ అధ్యక్షుడు జే. శివారెడ్డి గారు, రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి కె.ఆర్. లక్ష్మీకాంత్ రెడ్డి, రాష్ట్ర బిసి సెల్ సంయుక్త కార్యదర్శి వీరుపాక్షి రెడ్డి నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారి నాయకత్వంలోని గత వైసీపీ ప్రభుత్వాన్ని ఉదాహరణగా చూపించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ ప్రభుత్వం "నవరత్నాలు" అనే సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవితాలను మెరుగుపరిచిందని వివరించారు. అమ్మ ఒడి, ఆసరా, రైతుభరోసా, పెన్షన్ కానుకలు, విద్యా దీవెన,వాలంటీర్ వ్యవస్థ,నిరుపేదలకు ఇళ్ల పట్టలు మంజూరు చేసి పక్కా గృహాలను మంజూరు, అర్హత ఉంటే చాలు ప్రభుత్వ పథకాలు కోట్లాది ప్రజలకు నేరుగా ఆర్థిక సహాయం అందించబడింది. గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పారదర్శక పాలనను తీసుకువచ్చారు. ఆరోగ్యరంగంలో ఆరోగ్యశ్రీ, కుటుంబ వైద్యుడు వంటి పథకాలతో వైద్యం అందరికీ చేరువైంది.టీడీపీ కూటమి పాలన మరియు వైసీపీ పాలన మధ్య తేడా చాలా స్పష్టమని వైసీపీ నాయకులు ప్రజలకు వివరించారు. టీడీపీ కూటమి పాలనలో మోసపూరిత వాగ్దానాలు మాత్రమే ఉండగా, వైసీపీ పాలనలో హామీలను నిజాయితీగా అమలు చేశారని వారు తెలిపారు. పేదల కోసం పని చేసే ప్రభుత్వం వైసీపీదేనని, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం మళ్లీ వైసీపీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.గత వైసీపీ ప్రభుత్వంలో వికలాంగులకు వారి అర్హత ఆధారంగా ప్రభుత్వ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి వికలాంగులకు ప్రభుత్వం ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసింది.వాటి ఆధారంగా వారికి పింఛన్లు మంజూరు చేసింది.కాని ఇప్పటి టీడీపీ కూటమి ప్రభుత్వం వికాలాంగులకు పింఛన్లు రద్దు చేసి గత ధ్రువీకరణ పత్రాలు నకిలీ పత్రాలు అని మరల వైద్య పరక్షలు నిర్వహించి ఇప్పుడు ధ్రువీకరణ పత్రాలు పొందాలని అప్పటి వరకు పించన్లు నిలుపుదల చేస్తున్నట్లు ప్రభుత్వం నోటీసులు జారిచేయడం జరిగింది ఇలా వికలాంగుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని అప్పటి అర్హత ఇప్పుడు లేక పోవడం ఏంటో టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేస్తుందో ఎలా నమ్మించి ఇప్పుడు నట్టేట ముంచుతున్నారు అని ప్రజలు గ్రహించి మంచి చేసిన వైసీపీ వైయస్ జగన్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకోరావాలని ప్రజలు కూటమి టీడీపీకి గట్టి బుద్ధి చెప్పాలని తెలియజేశారు.ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాజకీయ వాతావరణంలో, ప్రతి పల్లెలో వైయస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీకి సానుభూతి చూపే ప్రజలపై వేర్వేరు దాడులు, అక్రమ కేసులు, రెడ్ బుక్ ఆధారిత ఫిర్యాదులు పెట్టి దారుణంగా నొక్కిఉండడం జరుగుతోందని వీటిని ప్రతికూలంగా ఉపయోగించి, తమ రాజకీయ వ్యతిరేకులను చూపుతూ, టీడీపీ కార్యకర్తలకు ఏ విధమైన కేసులు లేకుండా, పూర్తి రక్షణ మరియు ప్రోత్సాహం ఇవ్వడం జరుగుతుందని, ఈ పరిస్థితి ప్రజాస్వామ్య హక్కులను, రాజ్యాంగ వ్యతిరేకంగా చేస్తున్న దాడిగా ఉంది అని మండిపడ్డారు.వైసీపీ నేతలు, "ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన పోలీసులు, పార్టీ వ్యతిరేక కార్యకర్తలపై చర్యలు చేపడుతూ, ప్రజా సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇదే రాజకీయ ఒత్తిడి సృష్టించే మార్గం" అని పేర్కొన్నారు. ఈ వ్యవహారం వల్ల ప్రజల్లో భయ పరిస్థితి, రాజకీయ అసమానత, మరియు ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టమవుతోంది అని తెలిపారు. ప్రతి పల్లె, పట్టణంలో ప్రజలు, కార్యకర్తలు ఈ అక్రమ దాడులపై తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నాయకులు మరియు కార్యకర్తలతో సహానుభూతి వ్యక్తం చేసే ప్రజలు, తమ హక్కుల రక్షణ కోసం అధికారులను ఎదుర్కోవలసి వస్తుందని, అలాగే తదుపరి ఎన్నికల్లో కచ్చితమైన మెసేజ్ ఇవ్వాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు.బివైసీపీ ప్రభుత్వం వసతి భత్యం, ల్యాప్టాప్‌లు, విద్యా దీవెన, బడి కిట్లు వంటి పథకాల ద్వారా విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేకమైన ప్రభుత్వ పాఠశాలలు విద్యా పరంగా ప్రైవేట్ పాఠశాలలకు పోటీగా మారాయి. ప్రతి గ్రామానికి ఆరోగ్యశ్రీ, ఆరోగ్య సచివాలయాలు, మొబైల్ వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా వైద్య సేవలు ప్రతి పేద కుటుంబానికి చేరువ అయ్యాయి. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం అమరావతి రాజధాని పునర్నిర్మాణం, %ఖీఱఎవతీ చీవ% పునరుద్ధరణ, నగరంలో మలిన పదార్థాల శుభ్రత,ఆదాయాల పెంపు వంటి ప్రాజెక్టులు చేపడుతూ అభివృద్ధిని ముందుకు నడిపిస్తోంది. అయితే, ఈ ప్రాజెక్టులలో కొంతమంది వర్గాలకే లాభం, పేదలకు తగ్గిన ప్రయోజనాలు కొనసాగుతున్నాయి.బిఈ కార్యక్రమంలో జెట్పిటీసీ నిఖిల్ చక్రవర్తి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్ విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి బాపురం హరిరెడ్డి, నియోజకవర్గ ఆర్.టి.ఐ అధ్యక్షులు రాజ శరత్,మండల బిసి సెల్ అధ్యక్షులు చిన్న రాముడు,మండల యువజన అధ్యక్షులు సూర్య ప్రకాష్ రెడ్డి,సర్పంచ్ వీరాస్వామి,ఉప సర్పంచ్ రామలింగడు,నరసింహ రెడ్డి,ఈశ్వర్ రెడ్డి,నరసింహ రెడ్డి,చిన్న నరసింహుడు,జాన్,రాజరెడ్డి,కురువ బీరప్ప,తెలుగు లక్ష్మన్న ,ప్రభాకార్, శేఖర్,యల్లారెడ్డి,సక్కరప్ప,శివన్న,డోలు దాముడు,నీలకంఠ రెడ్డి,రంగారెడ్డి,సంజీవ రెడ్డి,బాలారెడ్డి,నరసింహులు,శంకర్ రెడ్డి,రాముడు,నర్సింహులు,సోమన్న,వెంకటేష్,హనుమంతు,మల్లయ్య,బద్రి,ప్రభాకర్,అత్తావుల్లా,రమేష్,నరసింహులు,నాగప్ప,నాగరాజు నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షులు ఎన్.యండి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



## యూరియా కొరత సృష్టిస్తున్న ఫర్టిలైజర్ వ్యవసాయ దుకాణాలుపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి

ఎమ్మిగనూరు ఆగస్టు 28 గురువారం నియోజకవర్గ పరిధిలోని ఫర్టిలైజర్ దుకాణం యాజమాన్యాలు యూరియా కొరత సృష్టించి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తక్షణం అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకొని ,దుకాణాలను సీజ్ చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సత్యన్న డిమాండ్ చేశారు. గురువారం నాడు స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలోని వ్యవసాయ శాఖ అధికారి జగదీష్ గారికి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఏఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సత్యన్న మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని ఫర్టిలైజర్ దుకాణ యాజమాన్యాలు యూరియా కొరత సృష్టించి రైతులను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని అన్నారు. . కావున ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు ఎమ్మిగనూరు నియోజకవర్గం లోని గోడౌన్లలో తనిఖీలు నిర్వహించి ,యూరియా కృతిమ కొరత సృష్టించిన దుకాణాలపై చర్యలు తీసుకోవాలని, యూరియాను అధిక ధరలకు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకుని లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఐ. ఎఫ్.టి.యు నాయకులు బాలరాజు,బాబు,మాలమహానాడు రాష్ట్ర నాయకులు ఎం.నరసన్న తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ సిటీ పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి

స్మార్ట్ సిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎస్. వెంకటేశ్వర్


తిరుపతి,ఉత్తేజిత ప్రతినిధి, ఆగస్టు 28.



స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ ఛైర్మన్ మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. తిరుపతి స్మార్ట్ సిటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల 40 వ సమావేశం గురువారం జరిగింది. ఆన్లైన్ ద్వారా చైర్మన్, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తుడా వి.సి. శుభం బన్సల్ పాల్గొనగా, నగరపాలక సంస్థ కార్యాలయం నుండి స్మార్ట్ ఎం.డి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పాల్గొన్నారు. పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. 6మెగా వాట్స్ సోలార్ ప్రాజెక్టు పరిశీలించి పిపిపి మోడ్ లో నిర్వహణ చేసేందుకు టెండర్లు పిలవాలని నిర్ణయించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ ప్రాజెక్టు తో ప్రస్తుతం పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ ఇండిపెండెంట్ డైరెక్టర్స్ డాక్టర్ రామచంద్ర రెడ్డి, డాక్టర్. రమాశ్రీ,, ఇంజనీరింగ్ అధికారులు, స్మార్ట్ సిటీ అధికారులు పాల్గొన్నారు.

## బయో స్టిములెంట్స్ "O" ఫామ్ ఇంక్లూడ్ చేసుకున్న తర్వాతనే విక్రయాలు జరుపుకోవాలి- రైతులకు విక్రయించకూడదు - డీలర్లు అందరు సహకరించాలి

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి




ఎమ్మిగనూరు ఆగస్టు 28 గురువారం మండల పరిధిలోని ఏనుగుబాల మరియు దైవందిన్నే గ్రామాలలో -పొలం పిలుస్తోందిఈరోజు 28-8-2025 వ తేదీన ఏనుగుబాల మరియు దైవందిన్నే గ్రామాలలో పొలం పిలుస్తోంది నిర్వహించడమైనది.ఇందులో భాగంగా రైతులకు వ్యవసాయ సలహాలు సూచనలు ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ మహమ్మద్ ఖాద్రి గారు పాల్గొని రైతులకు వ్యవసాయ సలహాలు మరియు సూచనలు అందజేశారు. ప్రతి ఒక్కరూ పంట నమోదు చేసుకోవాలి, పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం నుంచి ఇన్సూరెన్స్ , పంట నష్ట పరిహారం కానీ ఎరువులు కానీ యూరియా కానీ ఇతరత్రా పథకాలు అయితే వర్తిస్తాయి పంట నమోదు చేసుకోకపోతే ఏమి వర్తించవు.మరియు ప్రభుత్వం నుండి డ్రోన్స్ ద్వారా స్ప్రే మందులు గురించి రైతులకు వివరించడం జరిగినది ఇందులో భాగంగా 8 లక్షల వరకు సబ్సిడీ అందజేస్తారని విషయాన్ని రైతులు తెలియజేయడం జరిగింది.మరియు ఈరోజు శ్రీ హనుమాన్ ట్రేడర్స్ నందు ఇన్స్పెక్షన్ లో భాగంగా బయో స్టిములెంట్స్ గుర్తించడం జరిగింది, దీనిలో భాగంగా జీ1, జీ 2 మరియు "O" ఫారం ఇంక్లూడ్ చేయకుండా బిజినెస్ చేస్తున్నారు, దీనిలో భాగంగా దాదాపుగా రూ 406158/- అమ్మకాల నిలుపుదల చేయడం జరిగింది.ఇందు వెంట ఏఈఓ నరసింహుడు రసూల్, వినోద్ పాల్గొన్నారుమదిరేపల్లి శివశంకర్.మండల వ్యవసాయ అధికారి.ఎమ్మిగనూరు.

## సబ్ కలెక్టర్ కు గోడు విన్నవించుకున్న కల్లుకుంట గోవిందమ్మ.

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి



ఎమ్మిగనూరు ఆగస్టు 28 గురువారం కుమారుడు కులంతార వివాహం చేసుకుంటే తల్లిని సంవత్సర కిందట బట్టలూడదీసి స్తంభానికి కట్టివేసి కొట్టిన ఘటన సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునే ఘటన పెద్ద కడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో జరిగింది. ఇది జరిగి నేటికీ సరిగ్గా సంవత్సరం అయింది. ఆమె ఎమ్మిగనూరులో కొట్టం బాడుగకు తీసుకుని చాలా ఇబ్బందులు పడుతున్నానని సబ్ కలెక్టర్ ముందు కన్నీటి పర్యంతమైంది. ఊరికి వెళితే ఎక్కడ తనను కుమారుణ్ణి కూతురిని చంపేస్తారోనని అందరం ఇక్కడే బాడుగ ఉంటున్నామని తన బాధను వెళ్ళబోసుకుంది. అట్రాసిటీ బాధితులమైన మాకు ప్రభుత్వం నుండి లభించే సహాయం కింద మూడు సెంట్లు ఆ స్థలాన్ని కేటాయించాలని అలాగే తన కుమారునికి ఒక ఉద్యోగం కల్పించాలని ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ను ఆమె వేడుకొన్నారు ఆమెకు మద్దతుగా POW స్త్రీ విముక్తి మోర్చా రాష్ట్ర మహిళా అధ్యక్షురాల సుజ్ఞానమ్మమరియు మండల అధ్యక్షురాలు ఎం. కళావతి అలాగే నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు సుమాల చార్లెస్ సబ్ కలెక్టర్ ను కలవడం జరిగింది

ఉత్తేజిత దినపత్రిక

# నేత్రదానం ద్వారా మరొకరికి కొత్త జీవితం"






## ఎస్వీ అరవింద్ కంటి ఆసుపత్రిలో నేత్రదాన కేంద్రాన్ని ప్రారంభించిన టిటిడి ఈఓ శ్రీ జె. శ్యామలారావు

**తిరుపతి,ఉత్తేజిత ప్రతినిధి, ఆగస్టు 28.**

శ్రీవారి భక్తులు, ప్రజలుస్వచ్ఛందంగా నేత్రదానం చేసి ఎంతో మందికి కొత్త జీవితాన్ని అందించాలని టిటిడి ఈఓ శ్రీ జె. శ్యామలారావు పిలుపునిచ్చారు. తిరుపతి అలిపిరి సమీపంలోని శ్రీ వేంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రిలో గురువారం నేత్రదాన కేంద్రాన్ని ప్రారంభించి, ఈ సందర్భంగా ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 9398358828ను విడుదల చేశారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 25 %-% సెప్టెంబరు 8 వరకు 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు శ్రీ వేంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రిలో జరుగుతున్నవి. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ప్రారంభించిన నేత్రదాన కేంద్రం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈఓ మాట్లాడుతూ, "సర్వేంద్రియాణాం నయనం ప్రధానమ్" అనే సంస్కృత వాక్యాన్ని ఉదహరిస్తూ, శరీరంలోని అన్ని ఇంద్రియాలలో కంటికి ఉన్న ప్రాధాన్యత అత్యంత ఉత్కృష్టమైనది అన్నారు. 2019లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో, శ్రీ వేంకటేశ్వర స్వామి పాదాల చెంత ఆరు ఎకరాల విస్తీర్ణంలో తిరుపతి నగరంలో ఈ సుప్రసిద్ధ కంటి ఆసుపత్రి స్థాపించబడిందని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం మన దేశంలో కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ (కంటి మార్పిడి) కోసం కనీసం ఒక లక్ష కళ్ళు అవసరం ఉంటే, కేవలం 25 వేల కళ్ళే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం 11 లక్షలకు పైగా రోగులు కార్నియల్ ట్రాన్స్‌ప్లాంట్ కోసం ఎదురుచూస్తున్నారని, ఒక్కరి నేత్రదానం ద్వారానే ఇద్దరికి దృష్టి లభిస్తుందని చెప్పారు. అరవింద్ కంటి ఆసుపత్రిలో 80 శాతం కంటి సమస్యలకు అత్యల్ప ఖర్చుతో ఆధునిక వైద్యసేవలు అందిస్తున్నారని, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది కృషిని అభినందించారు. హార్వర్డ్ బిజినెస్ స్కూల్ (%ఎదీూ%) అధ్యయనాలు కూడా అరవింద్ నేత్రాసుపత్రిని సామాజిక ఆరోగ్య సేవల్లో ఆదర్శంగా గుర్తించిందన్నారు. "డయల్ యువర్ ఈఓ" కార్యక్రమంలో ఒక భక్తుడు చేసిన సూచన మేరకు ఈ నేత్రదాన కేంద్రం ఇవాళ తిరుపతిలో ప్రారంభించడం జరిగిందని చెప్పారు. కంటి దానం ద్వారా 80% వరకు అంధత్వ సమస్యలను అధిగమించవచ్చని, అందుకొరకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రపంచ ప్రసిద్ధ హైందవ ధార్మిక సంస్థ అయిన టిటిడి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోందని, నేత్రదానం వంటి సేవా కార్యక్రమాల్లో భక్తులు ముందుకు రావాలని ఈఓ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఒక వరం : ఎమ్మెల్యే గిత్త జయ సూర్య

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఆగస్టు 26:**

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు గొప్ప వరమని నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య పేర్కొన్నారు. మిడుతూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన మాదిరెడ్డి వెంకటరమణారెడ్డి కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వచ్చిన రూ 1,16,160/-రూపాయల మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుటుంబంలో ఒకరు అనారోగ్యం పాలైతే ఆ కుటుంబం మొత్తం కలత చెందుతుందని తెలిపారు. మీ కుటుంబాలకు కష్టం వచ్చినప్పుడు పెద్ద కొడుకులా ఉంటూ ఆదుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆనాడు మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఆ మాటను నేడు నిలబెట్టుతున్నాడని తెలిపారు. అందులో భాగంగానే అనారోగ్యం పాలైన వారికి ఆస్పత్రి ఖర్చులకోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చెక్కులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మాంద్ర సురేంద్ర నాథ్ రెడ్డి, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛందంగా నేత్రదానం చేయడానికి ముందుకు రండి





## నేత్రదాన ప్రతిజ్ఞాపత్రం పై సంతకం చేసిన జిల్లా కలెక్టర్

## జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్.

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,ఆగస్టు 28 :**

స్వచ్ఛందంగా నేత్రదానం చేయడానికి ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ప్రజలకు పిలుపునిచ్చారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ వారి ఛాంబర్లో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలిసి జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేత్రదానానికి సంబంధించిన ప్రతిజ్ఞా పత్రం పై నేత్రదానానికి స్వచ్ఛందంగా అంగీకారం తెలుపుతూ సంతకం చేసి ఎస్వీ మెడికల్ కాలేజ్ మరియు రుయా ఆసుపత్రి నేత్ర విభాగపు అధిపతికి అందించారు. జిల్లా కలెక్టర్ తో పాటు వారి తండ్రి గారి నేత్రాలను సైతం వారి మరణాంతరం అందించేలా ప్రతిజ్ఞా పత్రం పై సంతకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ..నేత్రదానం చేయడం ద్వారా మరో ఇద్దరికి కంటిచూపు లభిస్తుందన్నారు. అందుకనే తాను,తన తండ్రి గారి నేత్రాలను సైతం తమ మరణానంతరం ఐ బ్యాంకుకు అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావడం జరిగిందన్నారు. పోగొట్టుకున్న కంటి చూపును చికిత్స చేయడం ద్వారా తిరిగి పొందవచ్చునని, ఇందుకుగాను దానం చేయబడిన నేత్రం ద్వారా కార్నియా మార్పిడి చేయబడుతుందన్నారు. కావున నేత్రదానానికి సంబంధించి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వవచ్చునన్నారు. అలాగే నేత్రదానాన్ని కుటుంబం సంప్రదాయంగా చేసుకోవాలని తద్వారా మరో ఇద్దరికి కంటి చూపును అందించే అవకాశాన్ని కల్పించినట్లు అవుతుందని కలెక్టర్ తెలిపారు. ఈనెల 25 వ తేదీ నుండి సెప్టెంబర్ 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని నేత్రదాన విశిష్టతను తెలుసుకుని, తాము నేత్ర దానం చేయడమే కాకుండా తమ తోటి వారిని సైతం మరణానంతరం వారి నేత్రాలను దానం చేసేలా ప్రోత్సహించాలన్నారు.

# బొజ్జ గణపయ్య కు ఎమ్మెల్యేప్రత్యేక పూజలు



**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఆగస్టు 28**

నందికొట్కూరు పట్టణంలో వినాయక చవితి సందర్భంగా పగిడ్యాల రోడ్డు బైరెడ్డి నగర్,నంద్యాల రోడ్డు హౌసింగ్ బోర్డు కాలనీ, విద్యా నగర్, సుబ్బారావు పేట లో ఏర్పాటుచేసిన బొజ్జ గణపయ్యకు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయ సూర్య ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని గణేష్ ని ఆశీస్సులు స్వీకరించారు. అనంతరం పురోహితులు ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ముందుగా ఎమ్మెల్యే నియోజకవర్గం ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగి విజయాలు కలిగేలా ఆ విఘ్నేశ్వరుడు ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. పాడిపంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని గణనాథుని మనసారా వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో

నందికొట్కూరు అర్బన్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎస్సై చంద్రశేఖర్,సింగిల్ ఇండో చైర్మన్ మూర్తు జావలి టీడీపీ నాయకులు కృష్ణా రెడ్డి, రవికుమార్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, వడ్డే శ్రీనివాసులు, సత్తార్ మియ్య, వనజ, కళాకర్ , అయిల్ రవి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నందికొట్కూరును కర్నూలు జిల్లాలో కలపాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ డిమాండ్




## నంద్యాల వద్దు...కర్నూలు ముద్దు: ఐసా

## నందికొట్కూరు ప్రజల అభిప్రాయాలకు కూటమి ప్రభుత్వం తగిన న్యాయం చేయాలి!

**నందికొట్కూర్, ఆగస్టు: 28 :(ఉత్తేజిత ప్రతినిధి)**

నందికొట్కూరు నియోజకవర్గాన్ని కర్నూలు జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తూ నంద్యాల వద్దు...కర్నూలు ముద్దు అంటూ ..సిపిఐ(ఎం ఎల్) లిబరేషన్ తాలూకా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం నుండి పటేల్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా సిపిఐ(ఎం ఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి ఎస్. నాగార్జున మాట్లాడుతూ %-%గత వైసిపి ప్రభుత్వం నందికొట్కూరు ప్రజల అభిప్రాయాలను పక్కన పెట్టి, కేవలం 30 కి.మీ దూరంలో ఉన్న కర్నూలు జిల్లాకు కాకుండా, 60 కి.మీ దూరంలో ఉన్న నంద్యాల జిల్లాకు కలపడం వల్ల రైతులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రస్తుతం పరిపాలనా సౌలభ్యం కోసం, విద్యా %-% ఉపాధి అవకాశాల కోసం, నందికొట్కూరును కర్నూలు జిల్లాతో అనుసంధానం చేయాల్సిన ఉందని వారు పేర్కొన్నారు. కర్నూలు పట్టణంతో నందికొట్కూరు ప్రాంత ప్రజలకు సాంస్కృతిక, ఆర్థిక, విద్యా, వైద్య సంబంధాలు గాఢంగా ఉన్నాయని, కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలు, ఉద్యోగ అవకాశాలు నందికొట్కూరు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంటాయని వారు గుర్తుచేశారు. నందికొట్కూరును కర్నూలు జిల్లాలో కలపాలని ప్రభుత్వాన్ని తక్షణం డిమాండ్ చేస్తూ, ఈ అంశంపై ప్రజలను, ప్రజా సంఘాలను కలుపుకొని ఆందోళనలు కొనసాగిస్తామని నేతలు స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయం వద్ద తహసిల్దార్ శ్రీనివాసులు కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు చేరుకుచెర్ల గాబ్రియేలు,ఎసన్న, సుధాకర్,సీలన్న, సామన్న,సోమప్ప మహిళా సంఘం నాయకురాలు లక్ష్మీదేవి, మూర్తుజాభి, మల్లమ్మ, కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ,నరసింహులు, కాటేపోగు సామన్న,లింగాల శ్రీనివాసులు,ఐసా కిరణ్, సాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు..




# అనారోగ్యాలకు సీఎంఆర్ఎఫ్ వరం.





**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఆగస్టు 28**

అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య,అన్నారు. గురువారం మండలం లోని బ్రాహ్మణ కొట్కూరు గ్రామంలో టీడీపీ నాయకులు నందికొట్కూరు ఇంచార్జి గౌరు వెంకట రెడ్డి తో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరులో ముక్తియార్ రహమతుల్లా కు రూ. 1,22,500 లు, కాటేపోగు మేఘన కు రూ. 1,95,145 లు

బూరంక్రిష్ణకు రూ, 50,250లు నందికొట్కూరు పట్టణానికి చెందిన గువ్వల మద్దిలేటి కి రూ. 56,441లు మంజురైనా సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీర%శ% ప్రసాద్ రెడ్డి , సింగల్ విండో చైర్మన్ మద్దూరు హరి సర్వోత్తమ్ రెడ్డి, టీడీపీ నాయకులు ఖాతా రమేష్ రెడ్డి,రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్,మాజీ సర్పంచ్ కలీలుల్లా బేగ్, నందికొట్కూరు సింగల్ విండో చైర్మన్ మూర్తు జావలి, సత్తార్ మియ్య, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తేజిత దినపత్రిక



# ఆర్థిక దివాళా పై ఎన్నాళ్లీ మౌనం !

ఉద్యోగలుకు ఒకటో తారీఖున జీతాలు ఇవ్వడమే ప్రభుత్వ సక్సెస్‌గా భావిస్తున్నారు. పెన్షన్లు ఇవ్వడం, ఇంటింటికీ తిరి రేషన్ కార్డులు, రేషన్ ఇవ్వడం కూడా ఘనతగా భావిస్తున్నారు. గ్రామాల్లో స్థానిక సంస్థలు, అధికారులు, సర్పంచ్, వార్డుమెంటర్లు చేయాల్సిన పనులను మంత్రులు, ముఖ్యమంత్రులు చేపట్టడం సిగ్గుచేటు. అడ్డోగోలుగా కిలో కూపాయికి సన్నబియ్యం, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, తల్లికి వందనం, ఆరోగ్యశ్రీలు వంటివన్నీ పెట్టి సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు. ప్రజలను చేతగాని వాళ్లుగా తయారుచేసి, కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా మారుస్తున్నారు.దీంతో ఆస్పత్రాలు, స్కూళ్ల అభివృద్ధి లేకుండా పోయింది. రోడ్లు వేయడం లేదు. అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సిన ప్రజల డబ్బును పాలకులు దుబారాచేసేస్తున్నారు. మోడీ మొదలుకుని చంద్రబాబు,రేవంత్ వరకు ఇదే చేస్తున్నారు. ఇలా ఉచిత పథకాలు రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని దివాళా తీస్తున్నా..ఎవరు కూడా ప్రశ్నించడం లేదు. ఎందుకిలా అని నిలదీయడం లేదు. లబ్ది పొందుతున్న వారు ఎలాగూ ప్రశ్నించరు. ఉచిత పథకాల అమలును ఎంతవరకు విచారించ వచ్చున్న చర్చ జరగాలి. అభివృద్ధి పనులు, మౌలిక వసతులను పక్కనపెట్టి కేవలం ఉచిత పథకాల కోసం డబ్బు ఖర్చుపెట్టడాన్ని మెజార్టీ ప్రజలు తప్పుపడుతున్నారు. ఏది ఉచితం? ఏది ప్రజల అభ్యున్నతి కోసం అమలుచేస్తున్న పథకం అని చెప్పడం నిజంగానే కష్టం. వృత్తిచేసుకునే వారికి అవసరమైతే వారు వ్యాపారాలు చేసుకోవడానికి, పనులు చేసుకోవడానికి బ్యాంకుల ద్వారా ఆర్థిక చేయూతను అందించాలి. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికంలో మగ్గేవారి జీవనోపాధులు ఆ చిన్న పరికరాలపైనే ఆధారపడి ఉంటాయి. అలాంటివి ఇవ్వడంవల్ల వారి జీవితంలో పెద్ద మార్పు కనిపిస్తుంది. అయితే ఆర్థిక పరిస్థితులను తెలుసుకోకుండా అమలు చేసే వాగ్దానాలను అనుమతించకూడదని రాజకీయ పార్టీలు గుర్తించాలి. అలాగే ఉచిత పథకాలు అన్నవి పూర్తిగా ప్రభుత్వాల విచక్షణాధికార పరిధిలోని అంశమని చెప్పడానికి వీల్లేదు. ఏ రాష్ట్రమైనా ఉచిత పథకం అమలు చేస్తుంటే ప్రజలు కూడా వద్దని అనలేరు. ఉచిత పథకాలు అమలు చేయకూడదని కేంద్రం చట్టం చేస్తే..అది



చట్టబద్ధత కు లోబడి ఉండాల్సి వస్తుంది కనుక జాతీయస్థాయిలో దీనిపై చర్చించాలి. అధికారంలోకి వచ్చిన పార్టీ అమలుచేసే ఉచిత పథకాల గురించి ఆర్థిక సమర్థత కూడా ముఖ్యం. అదేపనిగా అప్పులు చేస్తూ పథకాలు అమలు సమంజ సమా కాదా అన్నదే ముఖ్యం. అప్పుడే అభివృద్ధి అన్నది ముందుకు సాగుతుంది. రేపటి తరం భవిష్యత్ కూడా ముఖ్యమన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పథకాలను సమీక్షించాలి. చర్చించాలి. అప్పుడే అభివృద్ధికి నిధుల కనుక ఆ దిశగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసే సంకల్పంతో ముందుకు సాగాలి. విపక్షాలకు కూడా ఓట్లు కావాలి గనక ప్రశ్నించడం లేదు. ఇక పన్నులు కట్టేవారు కూడా ప్రశ్నించడం లేదు. మేధావులు కూడా నిలదీయడం లేదు. ఇలా అయితే రాజకీయ పార్టీలు ఓట్ల వేటలో చేస్తున్న పథకాలు, పందేరాలతో రాష్ట్రాలు అప్పులో ఊబిలో కూరుకుపోతున్నాయి. వడ్డీలకే వేలకోట్లు తగలేస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు దివాళా అంచున ఉన్నాయి. రాజకీయ పార్టీల ఉచిత పథకాల హామీలపై సుప్రీంకోర్టు గతంలోనే కీలక వ్యాఖ్యలు చేసింది. అయినా రాజకీయ పార్టీలు దేశ ఆర్థిక వ్యవస్థను, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగడం లేదు. సరికదా ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేసి పథకాలను అమలు చేస్తున్నారు. పందేరం పథకాలు అన్నీ కూడా ఆర్థిక దివాళాకు హేతువు కాగలదు. ఎపిలో అయితే దానకర్ణుడిలా గత సిఎం జగన్ పథకాలను ప్రకటించడం, నగదు బదిలీలు చేపట్టడం నిత్యకృత్యంగా మార్చుకున్నారు. దీంతో ఎపి అప్పులకప్పగా మారింది. ఇలాంటి

పథకాలకు ఎక్కడో ఒకచోట చెక్ పడాల్సింది. డబ్బులు పంచే పథకాల బదులు అభివృద్ధి పథకాలపై దృష్టి సారించాలి. ఇబ్బడి ముబ్బడిగా డబ్బులను నేరు గా ఓటర్లకు బదిలీ చేసే ప్రక్రియను ఆపకుంటే దేశం ఆర్థికంగా దివాళా తీస్తుంది. అభివృద్ధి కుంటుపడుతుందని గుర్తించాలి. డబ్బులు పంచడమే అభివృద్ధి అంటూ చేస్తున్న ప్రకటనలకు ఇకనైనా చెల్లు చీటీ చెప్పాలి. ఉచిత పథకాలు, నగదు బదిలీలు, పేదలపేరుతో చేసే పందేరాల విషయంలో సమతుల్యం పాటించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు గతంలోనే అభిప్రాయపడింది. మనమంతా అత్యున్నత న్యాయస్థానానికి గౌరవం ఇవ్వాలి. ప్రజాస్వామ్య దేశంలో ఒక అంశంపై చర్చించి చివరకు నిర్ణయం తీసుకోవాల్సింది పార్లమెంటేనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆనాటి చీఫ్ జస్టిస్ ఎన్.వి. రమణ పునరుద్ఘాటించిన నేపథ్యంలో దీనిపై పార్లమెంట్ విస్తృతంగా చర్చించాలి. ఏది ఉచితమో ఏది అనుచితమో చర్చించేందుకు విస్తృత ప్రజాభిప్రాయం సేకరించాలి. గ్రామస్థాయి వరకు వివిధ రాజకీయ పార్టీలు చేస్తున్న పందేరాలపై చర్చ చేయాలి. ప్రజలు కూడా నిర్భయంగా చర్చించాలి. రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజలు, ఆర్థిక నిపుణలు ఎవరికి వారు తమ స్థాయిలో చర్చించి ఏది ఉచితమో..ఏది అనుచితమో..ఏది అవసరమో అన్నది చర్చచేయాలి. విపక్షాలు కూడా ఉచితాలను ప్రకటించి ఓట్లు పొందాలన్న కక్కుర్తిలో పడి ఏదిపడితే అదే అన్నట్లుగా హామీలు గుప్పిస్తున్నారు. ఉచితాలు ఎంతవకు అవసరమో అన్నది ప్రజలే సరైన నిర్ణయం తీసుకోవాలి. ఉచితంగా డబ్బులు అందుతున్నాయి గదా అనుకుంటే..పన్నుల రూపంలో మన జేబులు దోచేస్తున్న తీరును గుర్తించడం లేదు. తాము కష్టపడి పన్నుల రూపంలో కడుతున్న డబ్బులను ఉచితం పేరుతో ఇష్టానుసారంగా పంచిపెడుతూ రాజకీయ లబ్ది పొందుతున్న పార్టీలను దూరం పెడితే అసలు సమస్యే రాదు.

ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకోకుండా రాజకీయ పార్టీలు అమలు చేసే ఉచిత పథకాలను నియంత్రించేలా కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఏదో నిర్ణయం తీసుకోవాలి. చట్టబద్ధంగా ఇలాంటి ఉచిత పథకాలపై నియంత్రణకు దిగాలి. లేకుంటే పాలన అంటే పంచడం అన్నదే పనిగా పెట్టుకో గలరు. పార్లమెంటులో చర్చ చేసి ఉచిత పంపకాలపై ఆంక్షలు విధించాలి. దేశ ఆర్థిక పరిస్థితులు, ప్రజల సంక్షేమం గురించి ఆసక్తి ఉన్నవారు వీటిని దృష్టిలో ఉంచుకొని సూచనలు చేయాల్సిన సమయం ఆసన్న మైంది. ఉచిత పథకాలపై దేశవ్యాప్తంగా చర్చ మొదలు పెట్టాల్సి ఉంది. ఈ విషయాల గురించి ప్రస్తావించడం ద్వారా దేశంలో ఓ అవసరమైన చర్చకు ఇప్పుడు నాంది పలకాలి. అయితే చర్చలకు దూరంగా ఉంటున్న మోడీ ప్రభుత్వం ఈ విషయంలోనూ చర్చకు ముందుకు వస్తుందన్న అవకాశం లేదు. కానీ ఇప్పటికీ నిజాయితీగా ఉన్న నేతలు దీనిపై చర్చ చేస్తే మంచిది. పార్లామెంట్ అని చూడకుండా చట్టసభల్లో రాష్ట్రాలు చర్చించాలి. ప్రజల్లో నేతలు చర్చించాలి.

## బిజెపిలో కొత్తతరానికి ప్రాధాన్యం

### రాంమాధవ్‌కు అవకాశ దక్కేనా?

న్యూఢిల్లీ: భారతీయ జనతాపార్టీ ఇప్పుడు కొత్త రూపు సంతరించుకుంటోంది. నవతరం ముందుకు రావడంతో సిద్దాంతపరమైన నిబద్ధతలకు అవకాశం లేని కొత్త తరం దూసుకు వస్తోంది. అధికారమే పరమావధిగా ఇందులోని నేతలు ఆరాటపడుతున్నారు. అధికారం చేపట్టిన గత పదకొండేళ్లుగా మోడీ ద్వయం ఇక పార్టీలో తమకు తిరుగులేని విధంగా చేసుకున్నారు. విధాన నిర్ణయాలన్నీ ఇప్పుడు కేవలం మోడీ ద్వంయం కనుసన్నల్లోనే సాగుతున్నాయి. ఈ క్రమంలో ఉపరాష్ట్రపతి పదవికి అనూహ్యంగా రాధాకృష్ణన్ ఎంపిక చేశారు. ఇదో రకంగా ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో జరిగిన వ్యవహారంగా చూడాలి. అలాగే ఇప్పుడు బిజెపి అధ్యక్ష బాధ్యతలు ఎవరికి కట్టబెడతార్నది చూడాలి. మోడీ అనుయాయులకా లేక, పార్టీని నమ్ముకున్న వారికా అన్నది తెలియాలి. ఇప్టపికే అధ్యక్ష పదవిని పూర్తి చేసుకున్న నడ్డా స్థానంలో ఎవరన్నది తేలడం లేదు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల కారణంగా నడ్డాను కొనసాగించారు. రాధాకృష్ణన్ లాగా ఇప్పుడు కొత్త తరం ఎవరైనా వస్తారా అన్న చర్చ సాగుతోంది. తెరవెనక్కి పోయిన రాంమాధవ్ లాంటి వారిని మళ్లీ ముందుకు తీసుకుని వస్తారా అన్న చర్చ కూడా సాగుతోంది. ఆయన సమకాలీన వ్యవస్తలపై బాగా పట్టు ఉండడంతో పాటు, ఆర్ఎస్ఎస్ మనిషి. అయితే ఏదైనా మోడీ ద్వయంను కాదని ఏ ఒక్క నిర్ణయం కూడా జరగడం లేదు. అంతేగాకుండా పాతతరం నేతలకు మెల్లగా ఉద్వాసన పలికారు. ఈ క్రమంలో ఇప్పటికే అద్వానీ ఇంటికే పరిమితం అయ్యారు. ఆయనకు కనీసం రాష్ట్రపతి పదవి కూడా కట్టబెట్టకుండా కక్ష తీర్చుకున్నారు. అలాగే మురళీమనోహర్ జోషి, సుమిత్రా మహాజన్ లాంటి వారు దూరంగా ఉన్నారు. సుష్మాస్వరాజ్, అరుణ్ జైట్లీ లాంటి వారు గతించారు. ఉపరాష్ట్రపతిగా పదవీ విరమణ చేయడంతో వెంకయ్య నాయుడు ఇక పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన లేకుండా అయ్యారు. ఇక మిగిలిందల్లా..రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీలు మాత్రమే. ఇప్పటికే శతృఘ్ను సిన్హా, యశ్వంత్ సిన్హాలు బయటకు పోయారు. అరుణ్ శౌరి లాంటి వారు అడ్రస్ లేదు. మధ్యప్రదేశ్ సిఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కూడా కేంద్ర పార్టీలో ప్రమేయం లేకుండా పోయింది. ఈ క్రమంలో రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీలు ఈ దఫా వరకు మంత్రులుగా కొనసాగుతారు. తరవాత వీరు కూడా పార్టీకి దూరం కావడం ఖాయమని గుర్తించాలి. ఇప్పటికే పార్టీలో వీరికి పెద్దగా ప్రాధాన్యం లేదు. ఈ క్రమంలో పార్టీ పునర్వ్యవస్తీకరణ తీరు చూస్తే మనకు వారి వ్యూహం అర్థం కాగలదు. దేవేంద్ర ఫడ్నవీస్‌కు స్థానం కల్పించడం మహారాష్ట్ర ప్రాధాన్యత తెలియచెబుతోంది. రాష్ట్రస్థాయిని దాటి వేగంగా జాతీయ స్థాయికి ఎదిగిపోతున్న యోగి ఆదిత్యనాథ్‌కు అడ్డుకట్టవేయాలంటే మరో ఠాకూర్ నాయకుడు ఉండాల్సిందే కదా అని కొందరు అంటున్నారు. పార్టీలోని మిగతావారంతా మోదీ, అమిత్ షా తరువాతేనని ఈ మార్పు చేర్పులతో స్పష్టం చేయదల్చుకున్నారు. ఆయా రాష్ట్రాల్లో పార్టీ రాజకీయ ప్రయోజనాలను నిలబెట్టు కుంటూనే పార్టీలో తమ పట్టును మోడీ, అమిత్ షాలు నిలుపుకున్నారు. కర్ణాటక నుంచి యడియూరప్పను కేంద్ర కమిటీలోకి తీసుకున్నారు. అలాగే, మధ్యప్రదేశ్ చౌహాన్‌ను తప్పించే క్రమంలో కేంద్రమంత్రి మంత్రి మండలిలోకి తీసుకున్నారు. పార్టీకి కొత్తరక్తం అవసరం కంటే, పాతతరాన్ని వదిలించుకొనే లక్ష్యం కనిపిస్తోంది. యూపిలో యోగి ఆదిత్యనాథ్ విజయంతో, రేపు మోదీ వారసడుఉ అంటూ ప్రచారం సాగింది. ఈశాన్యం నుంచి శర్బానంద్ సోనోవాల్ ఎంపిక వెనుక కూడా రాజకీయాలు ఉన్నాయి. సోనోవాల్‌కు స్థానం కల్పించడంమంటే అసోం సిఎం శర్మను హద్దుల్లో ఉంచడం కోసమే అని అర్థం చేసుకోవాలి. ప్రతీ ఎన్నికనూ ఓ మహాయుద్ధంగా భావించే మోడీ ద్వయం ఇప్పుడు బిజెపి అధ్యక్షుడిని ఎన్నుకోవడంలో ఎవరిని తెరపైకి తెస్తారన్నది చూడాలి.

# భారత్ అమెరికా రాయబారిగా సెర్గియో గోర్

**భారత్‌తో గిల్లి కజ్జాలు కోరుకుంటున్న ట్రంప్**

న్యూఢిల్లీ: భారత్‌తో గిల్లి కజ్జాలనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరుకుంటున్నారు. సుంకాల పెంపు, వీసాలపై కఠిన నిబంధలను ఇలా ఒక్కో చర్య ట్రంప్ భారత వ్యతిరేకతను చాటాయి. తాజాగా మరో దుందుడుకు చర్యకు పూనుకున్నారు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు భారత్–అమెరికా సంబంధాలను తీవ్రస్థాయిలో దెబ్బతీస్తున్నాయి. తాజాగా అత్యంత వివాదాస్పదమైన వ్యక్తుల్లో ఒకరైన సెర్గియో గోర్‌ను భారత్ అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్య ఆసియాలో పర్యవేక్షకుడిగా నియమించడం దౌత్యవర్గాలను షాక్‌కు గురిచేసింది. ఒకప్పుడు భారత్ తీవ్రంగా వ్యతిరేకించిన పనినే ట్రంప్ బలవంతంగా చేశారు. 38 ఏళ్ల గోర్‌పై ట్రంప్‌నకు విపరీతమైన

నమ్మకం ఉంది. ఇతడు చెప్పిన మీదటే నాసా చీఫ్ నియామకాన్ని చివరి నిమిషంలో మార్చేశారు.

2009లో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా భారత–పాక్–అఫ్గానిస్థాన్‌ను ఒకే పాలసీ కిందకు తెచ్చేందుకు యత్నించారు. నాడు రిచర్డ్ హోల్‌బ్రూక్‌ను ఈ ప్రాంతం మొత్తానికి ప్రత్యేక రాయబారిగా నియమించారు. అయితే.. నాటి భారత విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ దీనిపై అమెరికా రాయబారి డేవిడ్ మల్‌ఫోర్డుకు తమ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ చర్య భారత్‌కు ఆమోదయోగ్యం కాదన్నారు. దీంతో నాడు బ్రూక్‌ను పాక్–అఫ్గానిస్థాన్‌కు మాత్రమే పరిమితం చేసినట్లు–వికీలీక్స్‌లో బహిర్గతమైన పత్రాల్లో తేలింది. ఇప్పుడు ట్రంప్ భారత్‌కు నచ్చని అటువంటి చర్యే



తీసుకొన్నారు.

శ్వేతసౌధంలో ట్రంప్ వ్యక్తిగత కార్యదర్శి హోదాలో అమెరికా ప్రభుత్వంలో ఏకంగా 4,000 నియామకాలు చేశారంటే.. గోర్ పరపతిని అర్థం చేసుకోవచ్చు. మస్క్ దోస్త్ జరేడ్ ఇస్సాక్‌మన్ నాసా చీఫ్‌గా తొలుత ప్రకటించారు. ఆయన నామినేషన్ ఆమోదం కోసం సెనేట్‌కు పంపే సమయంలో మస్క్–ట్రంప్ మధ్య విభేదాలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. అదే సమయంలో ఇస్సాక్‌మన్ డెమోక్రాట్లకు ఎన్నికల్లో నిధులు సమకూర్చినట్లు– గోర్ నుంచి అధ్యక్షుడికి సమాచారం వెళ్లింది. దీంతో డోజ్ అధిపతిగా మస్క్ చివరి రోజున.. నాసా చీఫ్ పదవి నుంచి ఇస్సాక్‌మన్ పేరును ట్రంప్ తొలగించారు. ఈ నేపథ్యంలో గోర్‌ను 'పాము'గా అభివర్ణిస్తూ మస్క్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇక సెనెట్‌లో ఆమోదముద్ర పడితే గోర్ భారత్‌కు రావడం ఖాయమవుతుంది. ఇది కూడా అంత ఈజీ ఏమీ కాదు. బైడెన్ ప్రభుత్వం నియమించిన ఎరిక్ గార్సెట్టీకి సెనెట్ ఆమోద ముద్ర వేయడంలో తీవ్ర జాప్యం చేసింది. దీంతో ఆయన చివరి రెండేళ్లు మాత్రమే భారత్‌లో పనిచేశారు. గోర్‌నియామకంపై భారత్‌లో మిశ్రమ స్పందన వస్తోంది. విదేశీ వ్యవహారాల నిపుణుడు, మాజీ దౌత్యవేత్త కన్వల్ సిబల్ స్పందిస్తూ భారత్‌లో నియమించిన దౌత్యవేత్తను దక్షిణ, మధ్య ఆసియాకు ప్రత్యేక దూతగా నియమించడం ఇదే తొలిసారి అన్నారు. పాకిస్థాన్ సహా పొరుగుదేశాలతో భారత్‌కు ఉన్న సంబంధాలను అతడు గమనిస్తాడన్నది వాస్తవమని పేర్కొన్నారు. అయితే.. ఈ చర్య భారత్, పాకిస్థాన్‌ను ఒకేగాటన కట్టినట్లవుతుందని.. ఇలాంటి అమెరికా వైఖరిని న్యూఢిల్లీ గతంలో తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. అంతేకాదు.. ఇక భారత్–అమెరికా సంబంధాల్లో ఇండో–పసిఫిక్ ప్రాధాన్యం కనుమరుగవుతుందని చెప్పారు. మరో మాజీ దౌత్యవేత్త నిరుపమారావ్ కూడా ట్రంప్ ఉద్దేశాలను ప్రశ్నించారు. ఈ నియామకం భారత్–అమెరికా సంబంధాలను దెబ్బతీస్తుందన్నారు. గోర్ దౌత్యవేత్త కాకపోవడం, భారత్, దక్షిణాసియాలో అతడికి అనుభవం లేకపోవడం ఇబ్బందికరమన్నారు. కేవలం వీరవిధేయతే ఏకైక అర్హతన్నారు. అధ్యక్షుడి అజెండాను ముందుకుతీసుకెళ్లడానికే అతడిని నియమించారన్నారు. అది భారత్‌తో సంబంధాలను బలోపేతం చేస్తుందని చెప్పలేమన్నారు. అమెరికా అనుసరించే పాక్–అఫ్గాన్ పాలసీతో భారత్‌ను కూడా కలపడం ఇబ్బందికరమే అని తెలిపారు.

వ్యక్తిగతంగా తనకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తిని భారత్‌లో నియమించి ట్రంప్ నుంచి మోదీ ప్రభుత్వానికి బలమైన సంకేతాలు వెళ్లాయని అనుకునేలా చేసతున్నారు. అధ్యక్షుడి నుంచి వచ్చే అభ్యంతరాలు, ఇతర సందేశాలపై భారత్ కూడా తీవ్రంగా పరిగణించి.. చర్చలు జరపాల్సిన అవసరం ఉంటుంది.

## ఓటరుతో ఆధార్ నమోదు చేయాలి

### బోగస్ ఓట్ల ఏరివేత పక్కాగా సాగాలి

న్యూఢిల్లీ: ఓటర్‌ను ఆధార్‌తో నమోదు చేయించే ప్రక్రియ జరక్కపోవడం, దానిని తప్పనిసరి చేయక పోవడంతో ఓటర్ల జాబితా ఎప్పుడూ గందరగోళానికి, విమర్శలకు గురవుతోంది. బీహార్ వ్యవహారంలో ఇది విమర్శలకు దారితీసింది. ఓట్ల నమోదు, తొలగింపు ప్రక్రియ అభిసు పాలయ్యింది. చివరకు సుప్రీం జోక్యం చేసుకునే పరిస్తితి వచ్చింది. విపక్షాలు ఆందోళనతో పార్లమెంట్‌ను స్తంభించ చేశాయి. ఈ క్రమంలో పక్కా ఓటరు నమోదు ప్రక్రియ అన్నది సవాల్‌గా తీసుకోవాలి. గతంలో ప్రతి ఒక్కరి ఫోన్‌లకు ఆధార్ నమోదు కోసం మెసేజ్‌లు వచ్చాయి. దీంతో ఓటరు కార్డుతో ఆధార్ నమోదు ద్వారా బోగస్ ఓట్లను అరికట్టాలని అధికారులు నిర్ణయించారు. ఒక వ్యక్తి ఒకే ఓటు హక్కు ఉండాలనేది ఎన్నికల కమిషన్ నిబంధన మేరకు ఆధార్ నమోదుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించినా అది ముందుకు సాగలేదు. ఓటరు జాబితాను పక్కాగా రూపొందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపినా, బీహారల్‌లో విమర్శల పాలయ్యింది. ఫొటో సిమిలర్ ఎంట్రీస్ సాఫ్ట్‌వేర్ ద్వారా డబుల్ ఓట్లు కలిగిన వారిని గుర్తించి జాబితాను రూపొందించవచ్చు. జాబితా సిద్ధం కాగానే జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇచ్చి వాటిని తొలగించేయాలి. ఇలా ప్రతి జిల్లాలో చర్యలు చేపట్టడం ముఖ్యం. దేశం యావత్తూ ఓట్ల నమోదు,ఆధార్ అనుసంధాన ప్రక్రియ కొనసాగితే పంచాయితీ ఉండదు. చాలామంది నివాసాలు మారడంతో రెండు, అంతకుమించి చోట్ల ఓటుహక్కు ఉంటోంది. కొంతమంది పిల్లల చదువు, ఉద్యోగరిత్యా పట్టణాల్లో నివాసం ఉంటున్నారు. సొంత గ్రామాల్లో ఓటు హక్కుతో పాటు నివాసం ఉంటున్నచోట సైతం వీరు ఓటు హక్కు వినియోగంచు కుంటున్నారు. దీంతో గ్రామ పంచాయతీ ఎన్నికలతో పాటు మున్సిపాల్టీ ఎన్నికల్లో సైతం ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. ఇలాంటి వాటిని నివారించడానికి ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టాలి. ఫొటో సిమిలర్ ఎంట్రీస్ సాఫ్ట్‌వేర్‌తో ఇటువంటి వాటికి చెక్ పెట్టే అవశం ఉంది. రెండు చోట్ల ఒకే ముఖ కవలికలు ఉంటే కొత్తగా వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో అధికారులు వీరిని గుర్తించవచ్చున్నారు. ఇలా రెండుచోట్ల ఓటుహక్కు ఉన్న వారందరినీ గ్రామాలు, వార్డుల వారీగా గుర్తించవచ్చు. ఇలా రెండేసి ఓటరు జాబితాలో ఉన్న వారిని ఒక చోట ఓటు హక్కు తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలి. అలాగే ఇతరరాష్ట్రాల్లోక్రూడా ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎలాంటి అవకాశం లేకుండా అధికారులు పక్కాగా చర్యలు తీసుకోవాలి. ఓటరుకార్డు ఉన్న వారు ఫారం–6లో పూర్తి వివరాలు నింపి సంబంధిత బీఎల్‌వోలకు అందజేస్తే వాటిని క్రోడీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. నమోదు చేసిన వెంటనే ఓటరు ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. వీటితో పాటు డబుల్ ఓటరు కార్డులున్న వారికి ఇప్పటికే సమాచారం అందించి తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తారు.

# రేపటి నుంచే అదనపు సుంకాలు.. భారత్‌కు నోటీసులిచ్చిన అమెరికా

దిల్లీ: రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అదనపు సుంకాలు మరికొన్ని గంటల్లో అమల్లోకి రానున్నాయి. దీనిపై అమెరికా తాజాగా న్యూదిల్లీకి అధికారికంగా నోటీసులు పంపించింది. అగ్రరాజ్య కాలమానం ప్రకారం ఆగస్టు 27వ తేదీ ప్రారంభమయ్యే అర్ధరాత్రి 12.01 గంటల నుంచి (అంటే భారత కాలమానం ప్రకారం ఆగస్టు 27 ఉదయం 10 గంటల ప్రాంతంలో) ఈ అదనపు సుంకాలు అమల్లోకి వస్తాయని స్పష్టంచేసింది. ఆ సమయం తర్వాత నుంచి అమెరికాలోకి ప్రవేశించే భారత ఉత్పత్తులకు ఈ టారిఫ్‌లు వర్తిస్తాయని వెల్లడించింది. ఈమేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ తమ నోటీసుల్లో పేర్కొంది.భారత్‌లో గతంలో అమెరికా 25 శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. అవి ఆగస్టు 7 నుంచే అమల్లోకి వచ్చాయి. అయితే, రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో మరో 25శాతం అదనపు టారిఫ్‌లను విధిస్తున్నట్లు ఇటీవల అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతో న్యూదిల్లీపై మొత్తం సుంకాలు 50శాతానికి



పెరిగాయి. ఈ టారిఫ్‌లతో భారతీయ వస్త్ర పరిశ్రమ, ఆక్వా రంగం, తోలు ఉత్పత్తులపై వెంటనే ప్రభావం పడనుంది. భారత్ నుంచి ఎగుమతయ్యే అతికొద్ది వస్తువులకే ఈ అధిక సుంకాల నుంచి మినహాయింపు ఉంది.'ఒత్తిడి పెరగొచ్చు.. అన్నింటినీ భరిస్తాం'.. సుంకాల డెడ్‌లైన్ వేళ ప్రధాని మోదీ

ఈ అదనపు సుంకాలపై ఇప్పటికే భారత్ అభ్యంతరం వ్యక్తంచేసింది. ఇది అనుచితం, అన్యాయం, అహేతుకం' అని స్పష్టంచేసింది. ఈ విషయంలో దేశ ప్రయోజనాలను

కాపాడుకు నేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. మరోవైపు, సోమవారం ప్రధాని మోదీ కూడా దీనిపై స్పందించారు. రైతులు, పశుపోషకులు, చిన్నతరహా పరిశ్రమల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఈవిషయంలో తమపై ఒత్తిడి పెరగొచ్చని.. కానీ దానిని భరిస్తామని స్పష్టంచేశారు.

## మేలుకోరే వారే నిస్వార్థులు

తిరుమల:మంచి చెప్పేవారే మనవారు. మన మేలుకోరేవారు నిస్వార్థపరులు. మనం చెడిపోతే సంతోషించేవారు స్వార్థపరులు. ఇలాంటివారిలోనే అహంకారం నిండి ఉంటుంది. ఫల్గుణుడు, శ్రీకృష్ణుడు ఎంతోకాలం సన్నిహితులుగా మెలిగారు. రణరంగం మధ్యలో రథాన్ని నిలిపి గీతను బోధిస్తున్నప్పుడు పార్థసారథి తన చెలికాడే కదా… ఈయన చెప్పేది తానెందుకు వినాలని కౌంతేయుడు భావించి ఉంటే బహుశా మహాభారత –యుద్ధం సంభవించేదే కాదేమో! ధీరులు అంటే కండబలం ఉన్నవారు కానేకాదు. సమర్థులై, వివేకం కలిగినవారే ధీరులు. సమర్థత ఉంటే కార్యసాధకులవుతారు. అశోకుడి జీవిత చరిత్ర గమనిస్తే చకితులం అవుతాం. కండ బలంకన్నా అతడి మస్తిష్కం గొప్పది. అందువల్ల అతడెన్నో యుద్ధాలను జయించగలిగాడు. అతడి బలహీనత రాజ్యకాంక్ష. ఆలోచనలు మాత్రం గొప్పవి. జయాపజ యాలు ఇహానికి సంబంధించినవని శాంతిలోనే ధర్మం ఉందని గ్రహించాడు. అందుకే కళింగ యుద్ధంలో విజయం సాధించిన అనంతరం వివేకం మేలుకొని గౌతమ బుద్ధుడు చెప్పిన పథంలో నడిచాడు.




# ఆన్‌లైన్ డెలివరీ వర్కర్ల కోసం కొత్త పథకం..

గిగ్, ప్లాట్ ఫామ్ వర్కర్ల కోసం సామాజిక భద్రతా పథకాన్ని తీసుకొచ్చేందుకు కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ ఫుడ్, గ్రాసరీ డెలివరీ చేసే సిబ్బంది ఈ కేటగిరీలోకే వస్తారు. వారందరికీ వచ్చే బడ్జెట్‌లోనే శుభవార్త అందనుందని తెలుస్తోంది. నెల నెలా పెన్షన్ ఇచ్చేందుకు కొత్త పథకాన్ని అందిస్తారని కేంద్ర ప్రభుత్వ వర్గాల సమాచారం. ఆ వివరాలు తెలుసుకుందాం.

ప్రస్తుతం జొమాటో, స్విగ్గీ, జెప్టో, అమెజాన్, మీసో, ఫ్లిప్‌కార్ట్ అంటూ ఆన్‌లైన్ డెలివరీ సంస్థలు అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారా ఆర్డర్ చేస్తే ఇంటికే డెలివరీ చేస్తారు. అయితే, ఆన్‌లైన్ ఫుడ్, గ్రాసరీ వంటివి ఆన్‌లైన్ డెలివరీ చేసే వర్కర్లకు ఇప్పటి వరకు ఎలాంటి ఉద్యోగ భద్రత లేదు. ఈ క్రమంలో వారికి సైతం సామాజిక భద్రతా పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. గిగ్ వర్కర్ల కోసం సోషల్ సెక్యూరిటీ కంట్రిబ్యూష్ సిస్టమ్ ద్వారా పెన్షన్ అందించనున్నట్లు సమాచారం.

ఉద్యోగం కల్పించే ప్లాట్‌ఫామ్స్ గిగ్ వర్కర్లకు ఇచ్చే వేతనాల నుంచి కొత్త మొత్తం కట్ చేసి దానిని ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్‌కి జమ చేయాల్సి ఉంటుంది. దానికి అదనంగా కేంద్ర ప్రభుత్వం సైతం 3-4 శాతం చొప్పున జమ చేయనున్నట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా ఓ కథనం ప్రచురించింది. ఈ కొత్త పథకం కేవలం ఫుడ్ డెలివరీ, రైడ్ హెయిలింగ్ ప్లాట్‌ఫామ్స్‌కి మాత్రమే కాకుండా సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్, ఇతర గిగ్ ఎకానమీ వర్కర్లకు సైతం వర్తింపజేయాలని కేంద్రం భావిస్తున్నట్లు పేర్కొంది. కొన్ని సంవత్సరాల క్రితం గిగ్ వర్కర్లను సైతం కార్మిక చట్టాల పరిధిలోకి తీసుకొచ్చారు. అయితే, ఇప్పటికీ చాలా రాష్ట్రాల్లో ఆయా కోడ్స్ అమలు చేయడం లేదు.

సామాజిక భద్రతా పథకంలో సామాజిక భద్రతా నిధిని ఏర్పాటు చేయడం, ఆరోగ్యం, ప్రమాద, ఇతర బీమా ప్రయోజనాలను కల్పించనున్నారు. కొన్ని నెలల క్రితం కార్మిక శాఖ మంత్రి మాన్సుఖ్ మాండవియా, గిగ్ వర్కర్ల కోసం సామాజిక భద్రతను అమలు చేయడం అనేది లేబర్ కోడ్స్ పూర్తి అమలుకు ముందే ఉండొచ్చని తెలిపారు. ఈ క్రమంలోనే ఒక ఉన్నతాధికారి నేతృత్వంలో ప్రత్యేక ప్యానెల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కొత్త పథకం ద్వారా రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కేంద్రం భావిస్తోందని ఈ అంశానికి సంబంధం ఉన్న వ్యక్తులు తెలిపినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా కథనంలో పేర్కొంది.

గిగ్ వర్కర్ల కోసం సోషల్ సెక్యూరిటీ కల్పించడమనేది ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతగా కార్మిక శాఖ మంత్రి తెలిపారు. ఆన్లైన్ డెలివరీ కార్మికలకు ఎలాంటి సామాజిక భద్రతా పథకం లేదని పలు సర్వేలు చెప్పిన క్రమంలో కేంద్రం ఈ విషయంపై దృష్టి సారించినట్లు తెలిపారు. అలాగే ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆయుష్మాన్ భారత్, యాక్సిడెంట్, లైఫ్ ఇన్సూరెన్స్ వంటివి గిగ్ వర్కర్లకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్స్‌తో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. అలాగే ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు గిగ్ వర్కర్ల కోసం సోషల్ సెక్యూరిటీ కల్పించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# లక్షాధికారిని చేసే ఎస్బీఐ కొత్త స్కీం.. రూ. లక్ష రావాలంటే నెలకు ఎవరు ఎంత ఇన్వెస్ట్ చేయాలో తెలుసా?

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్.. ఎస్బీఐ ఇటీవల ఎస్బీఐ ప్యాట్రన్స్, హర్ ఘర్ లఖ్‌పతి అనే రెండు కొత్త పథకాల్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్యాట్రన్స్ స్కీమ్.. 80 ఏళ్లుపైబడిన వారి కోసం అధిక వడ్డీ రేటు చెల్లిస్తూ తీసుకొచ్చిన ఫిక్స్‌డ్ డిపాజిట్ స్కీమ్. ఇక హర్ ఘర్ లఖ్‌పతి పథకం విషయానికి వస్తే.. ఇది ఒక ప్రీ కాలిక్యులేటెడ్ రికరింగ్ డిపాజిట్. ఇక్కడ రూ. లక్ష లేదా అంతకంటే ఎక్కువ నిధుల్ని సమకూర్చుకునేందుకు ఉద్దేశించిన స్కీమ్. ఇక్కడ రికరింగ్ డిపాజిట్లకు కనీస కాలవ్యవధి 12 నెలలు కాగా.. గరిష్ఠంగా 120 నెలలు ఉంది. సాధారణగా ఆర్‌డీల్లో మనం నెలకు రూ. 500, రూ. 1000 ఇలా ఎంతైనా ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్తాం. కానీ.. ఎస్బీఐ కొత్త స్కీంలో మాత్రం మీకు ఎంత అవసరం అన్న దాన్ని బట్టి వడ్డీ రేట్లను బట్టి ముందే నెలనెలా ఎంత చెల్లించాలో తెలుసుకోవచ్చు. దానిని బట్టే ఆర్‌డీ చేయాల్సి ఉంటుంది.

ఇక్కడ మనం ఎంత కాలవ్యవధిపై నెలకు ఎంత కట్టాలి అనేది ముందుగానే లెక్కలు ఉంటాయి. గరిష్ఠంగా 3-4 ఏళ్ల వ్యవధి రికరింగ్ డిపాజిట్లపై అత్యధికంగా సాధారణ ప్రజలకు బ్యాంకు 6.75 శాతం




వడ్డీ రేటు ఆఫర్ చేస్తోంది. ఇతర టెన్యూర్లపై మాత్రం 6.50 శాతంగా వడ్డీ రేటు ఉంది. ఇదే సీనియర్ సిటిజెన్ల విషయానికి వస్తే అత్యధికంగా 3-4 ఏళ్ల డిపాజిట్లపై 7.25 శాతం వడ్డీ రేటు, ఇతర డిపాజిట్లపై 7 శాతంగా వడ్డీ రేట్లు ఉన్నాయి.

రూ. లక్ష రావాలంటే ఇప్పుడు జనరల్ సిటిజెన్, సీనియర్ సిటిజెన్.. ఏ టెన్యూర్లపై నెలకు ఎంత ఇన్వెస్ట్ చేయాలనేది తెలుసుకుందాం. ముందుగా సాధారణ ప్రజల విషయానికి వస్తే.. మూడేళ్ల కోసం అయితే నెలకు రూ. 2500 చొప్పున ఇన్వెస్ట్ చేస్తే.. 6.75 శాతం వడ్డీ రేటు లెక్కన మెచ్యూరిటీకి రూ. లక్ష పొందొచ్చు. ఇదే నాలుగేళ్లకు అయితే ఇదే వడ్డీ రేటుపై నెలకు రూ .1810 చొప్పున డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఐదేళ్లలో చూస్తే వడ్డీ రేటు 6.50 శాతంగా ఉంటుంది. ఇక్కడ ప్రతి నెలా రూ. 1407 చొప్పున జమ చేయాలి. సీనియర్ సిటిజెన్లకు సాధారణ ప్రజల కంటే దాదాపు 50 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ రేటు అధికంగా ఉంది. కాబట్టి వీళ్లకు రూ. లక్ష రావాలంటే కాస్త తక్కువే డిపాజిట్ చేయొచ్చు. మూడేళ్ల కాలానికి 7.25 శాతం వడ్డీ రేటు లెక్కన.. నెలకు రూ. 2480 డిపాజిట్ చేస్తే సరిపోతుంది. ఇదే నాలుగేళ్లలో అయితే ప్రతి నెలా రూ. 1791 జమ చేయాలి. ఐదు సంవత్సరాలకు 7 శాతం వడ్డీ రేటు లెక్కన నెలకు రూ. 1389 చొప్పున జమ చేసుకుంటూ వెళ్లాలి.

లఖ్‌పతి ఆర్‌డీ పథకాన్ని భారతీయ నివాసితులు ఇండివిడ్యువల్‌గా లేదా జాయింట్‌గా తెరవొచ్చు. పదేళ్లు పైబడిన మైనర్ల పేరిట గార్డియెన్స్ లేదా తల్లిదండ్రులు అకౌంట్ తెరవొచ్చు. గడువుకు ముందే రూ. 5 లక్షల్లోపు విత్‌డ్రా చేస్తే.. 0.50 శాతం, ఆపైన ఉంటే ఒక శాతం పెనాల్టీ చెల్లించాలి. వరుసగా 6 నెలలు ఇన్‌స్టాల్‌మెంట్స్ చేయకుంటే ఖాతా మూసేస్తారు.



# కొత్త పన్ను శ్లాబుల నుంచి టీడీఎస్ వరకు..!

పన్ను చెల్లింపుదారులు ఎప్పటికప్పుడు జరుగుతున్న, వస్తున్న మార్పుల గురించి తెలుసుకుంటూ ఉండాలి. గత 6 నెలల్లో చూసినట్లయితే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కీలక మార్పులు చేసింది. ముఖ్యంగా గతేడాది జులైలో బడ్జెట్ సమయంలో ఎన్నో మార్పులు వచ్చిన సంగతి తెలిసిందే. టాక్స్ శ్లాబుల్లో మార్పులు, స్టాండర్డ్ డిడక్షన్ పెంపు సహా ఎన్నో మారాయి. దీనికి తగ్గట్లుగా ఆర్థిక ప్రణాళిక చేసుకోవాల్సి ఉంటుంది.

బడ్జెట్- 2025కు ఇంకొద్ది రోజులే ఉంది. ముఖ్యంగా బడ్జెట్ గురించి టాక్స్‌పేయర్లు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఇందులో తమ కోసం ఏమైనా ఊరట కలిగించే ప్రకటనలు వసాయా.. రావా.. అని చూస్తారని చెప్పొచ్చు. కొత్త పన్ను విధానాన్ని మరింత దగ్గరకు చేసేందుకు.. ఆకర్షణీయంగా మార్చేందుకు కీలక ప్రకటనలు ఉండొచ్చని ఆశిస్తున్నారు. అయితే.. ఈ సమయంలోనే గత కొంత కాలంగా ఆదాయపు పన్నుకు సంబంధించి ఎలాంటి మార్పులు జరిగాయనేది తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. చివరిసారి ప్రభుత్వం గతేడాది అధికారంలోకి వచ్చాక.. జులైలో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టింది. అప్పుడు ఇన్‌కంటాక్స్‌కు సంబంధించి ముందుగా ఊహించినట్లుగానే కొన్ని ప్రకటనలు వచ్చాయి. ఇందులో కొత్త పన్ను విధానంలోనే కీలక మార్పులు చేసింది. స్టాండర్డ్ డిడక్షన్ పెంచడంతో పాటుగా.. టాక్స్ శ్లాబుల్ని సవరించింది. ఈ కొత్త నిబంధనలు ఇప్పటికే 2024, ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వచ్చాయి. మరోవైపు.. ప్రభుత్వం ఆదాయపు పన్ను చట్టాన్ని మరింత సరళీకరించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే బడ్జెట్‌లో మరిన్ని ఊరట కలిగించే ప్రకటనలు రానున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలోనే గత 6 నెల్లలో చోటు చేసుకున్న మార్పుల గురించి చూద్దాం.

1. కొత్త శ్లాబులు- ఆదాయపు పన్ను చట్టం.. కొత్త పన్ను విధానం కింద శ్లాబుల్ని సవరించింది కేంద్రం. ఇందులో భాగంగా రూ. 7 లక్షలు, రూ. 10 లక్షల వార్షికాదాయం ఉన్న మధ్యతరగతి వర్గానికి మేలు జరిగింది. వీరికి పన్ను రేట్లలో దాదాపు 5 శాతం వ్యత్యాసం రావడం విశేషం. కొత్త పన్ను విధానం మార్పుల తర్వాత 0-3 లక్షల వరకు నో టాక్స్ ఉండగా.. రూ. 3-7 లక్షలపై 5 శాతం, రూ. 7-10 లక్షల ఆదాయంపై 10 శాతం, రూ. 10-12 లక్షలపై 15 శాతంగా టాక్స్ రేట్లు ఉన్నాయి. రూ. 12-15 లక్షల వార్షికాదాయంపై 20 శాతం టాక్స్ రేట్లు ఉండగా.. ఆపైన వర్గానికి 30 శాతం టాక్స్ ఉంది.

2. స్టాండర్డ్ డిడక్షన్- పాత పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ ఏం మార్చకుండా.. కొత్త పన్ను విధానంలో మాత్రం రూ. 50 వేల నుంచి 50 శాతం పెంచి రూ. 75 వేలకు చేర్చింది. పాత దాంట్లో రూ. 50 వేలుగానే ఉంది.

3. కాంట్రిబ్యూషన్- నేషనల్ పెన్షన్ సిస్టమ్‌లో ఎంప్లాయర్ కాంట్రిబ్యూషన్ కింద మినహాయింపు పరిమితిని 10 శాతం నుంచి 14 శాతానికి పెంచింది. దీంతో రిటైర్మెంట్ ఫండ్స్‌లో ఉద్యోగులు ఎక్కువ ఆదా చేసుకునే అవకాశం ఉంటుంది.

4. క్యాపిటల్ గెయిన్స్ టాక్స్- షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ టాక్స్ 15 శాతం నుంచి 20 శాతానికి పెరిగింది. ఇక లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ టాక్స్ రేటు 10 శాతం నుంచి 12.5 శాతానికి పెరిగింది. ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్ల లో పన్ను మినహాయింపు పరిమితి రూ. లక్ష నుంచి రూ. 1.25 లక్షలకు పెరిగింది. ఇది లాంగ్ టర్మ్ ఇన్వెస్ట్‌మెంట్లను ప్రోత్సహించేందుకు ఉద్దేశించింది.

5. లగ్జరీ వస్తువులపై టీసీఎస్- రూ. 10 లక్షలకు మించి విలువైన లగ్జరీ వస్తువులపై టీసీఎస్ విధించనున్నట్లు ప్రకటించింది. టీసీఎస్ అంటే టాక్స్ కలెక్షన్ ఎట్ సోర్స్- మూలం వద్ద పన్ను విధింపు ఇది 2025, జనవరి 1 నుంచే అమల్లోకి వచ్చింది.




# ట్రంప్ రాకతో భయం.. ఉద్యోగాలు మానేస్తున్న భారతీయ విద్యార్థులు!



అగ్రరాజ్యం అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి విదేశీ వలసదారుల్లో భయాలు పెరిగిపోయాయి. ముఖ్యంగా ట్రంప్ గెలిచినప్పటి నుంచే వారిలో ఆందోళన మొదలైనా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మరింత టెన్షన్ పడిపోతున్నారు. ముఖ్యంగా భారతీయ విద్యార్థులు.. అక్కడే చదువుకుంటూ చిన్న చిన్న ఖర్చుల కోసం చేసే పార్ట్ టైమ్ ఉద్యోగాలను సైతం వదిలేస్తున్నారు. అందుకు గల కారణాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

గతేడాది సెప్టెంబర్ నెలలో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించినప్పటి నుంచి.. అమెరికాలో ఉండే విదేశీయుల్లో ఆందోళన మొదలైంది. ఎక్కడ తాము బహిష్కరణకు గురవుతామోనంటూ తెగ టెన్షన్ పడిపోతున్నారు. ముఖ్యంగా యూఎస్ 47వ అధ్యక్షుడిగా ట్రంప్ పదవీ బాధ్యతలు చేపట్టడానికి కొన్ని రోజుల ముందు నుంచే.. అమెరికాలో ఉండే భారతీయ విద్యార్థులు పార్ట్ టైమ్ ఉద్యోగాలను మానేస్తున్నారు. కళాశాలలకు వెళ్లొచ్చిన తర్వాత సమయం ఉంటున్నా ఉద్యోగాలు చేసేందుకు ఏమాత్రం ఆసక్తి చూపించడం లేదు. అందుకు గల కారణాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

నాలుగు రోజుల క్రితమే అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు చేపట్టారు. అయితే మొదటి రోజే వీసా నిబంధనలను కఠినతరం చేస్తున్నామంటూ అందరికీ షాక్ ఇచ్చారు. ఓవైపు జన్మతః పౌరసత్వం రద్దు చేస్తూనే.. మరోవైపు ఎఫ్-1 వీసాపై వచ్చిన విదేశీ విద్యార్థులు నిబంధనలు ఉల్లంఘించి పనులు చేసేందుకు వీల్లేదని చెప్పారు. దీంతో అమెరికాలో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులు అంతా.. చిన్న చిన్న ఖర్చుల కోసం చేసే పార్ట్ టైమ్ ఉద్యోగాలను మానేశారు.

అసలే లక్షల్లో అప్పు చేసి బాగా చదువుకుని మంచి స్థాయికి రావాలని కలలు కంటూ అమెరికాకు చేరుకున్న విద్యార్థులు.. తమ ఖర్చులు వెళ్లదీయడం కోసం అక్కడే పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తుంటారు. ముఖ్యంగా కాలేజీ అయిపోయాక.. స్థానికంగా ఉండే పెట్రోల్ బంక్‌లు, హోటళ్లు, రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్లు వంటి వాటిల్లో పని చేస్తుంటారు. ఎంత కష్టమైనా సరే పడుతూ.. అక్కడే డబ్బులు సంపాదించుకుని చదువును కొనసాగిస్తుంటారు. అయితే ఎఫ్-1 వీసాలపై యూఎస్ వెళ్లిన అంతర్జాతీయ విద్యార్థులకు వారానికి 20 గంటల వరకు మాత్రమే పని చేసే అనుమతి ఉంది.

కానీ ఖర్చులు ఎక్కువగా ఉండడంతో విదేశీ విద్యార్థులు.. ముఖ్యంగా భారతీయ విద్యార్థులు మరిన్ని ఎక్కువ గంటలు పని చేస్తున్నారు. కానీ ట్రంప్ రాకతో.. ఈ ఉద్యోగాలు వారికి ఎంతో అవసరమే అయినప్పటికీ ప్రస్తుతం వారంతా ఉద్యోగాలు మానేయాల్సి వస్తోంది. ఒకవేళ వారు నిబంధనలు ఉల్లంఘించి పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తున్నట్లు అధికారులు గుర్తిస్తే.. ఎక్కడ తాము స్వదేశాలకు తిరిగి వెళ్లిపోవాల్సి వస్తుందోననే ఇలా చేస్తున్నారు. ఈ చిన్న ఉద్యోగాల కోసం తమ భవిష్యత్తును ప్రమాదంలో పడేయడానికి ఏమాత్రం ధైర్యం చేయలేకపోతున్నారు.

**ఖర్చులు ఎక్కువగా ఉండడంతో విదేశీ విద్యార్థులు.. ముఖ్యంగా భారతీయ విద్యార్థులు మరిన్ని ఎక్కువ గంటలు పని చేస్తున్నారు. కానీ ట్రంప్ రాకతో.. ఈ ఉద్యోగాలు వారికి ఎంతో అవసరమే అయినప్పటికీ ప్రస్తుతం వారంతా ఉద్యోగాలు మానేయాల్సి వస్తోంది. ఒకవేళ వారు నిబంధనలు ఉల్లంఘించి పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తున్నట్లు అధికారులు గుర్తిస్తే.. ఎక్కడ తాము స్వదేశాలకు తిరిగి వెళ్లిపోవాల్సి వస్తుందోననే ఇలా చేస్తున్నారు.**

ఇల్లినాయిస్‌లోని ఒక విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేట్ చేస్తున్న భారతీయ విద్యార్థి అర్జున్ మాట్లాడుతూ.. "నేను నా నెలవారీ ఖర్చుల కోసం ఓ కేఫ్‌లో పార్ట్ టైమ్ జాబ్ చేసేవాడిని. గంటకు 7 డాలర్లు సంపాదించేవాడిని. ఇలా ప్రతిరోజూ 6 గంటలు పనిచేస్తూ.. రోజుకు 42 డాలర్లు సంపాదించుకుంటాను. ఇది నా ఖర్చులకు బాగానే సరిపోతుంది. కానీ ఇమ్మిగ్రేషన్ అధికారులు అనధికారిక పనిపై కఠినంగా వ్యవహరిస్తున్నారని తెలిసినప్పటి నుంచి పని మానేశాను. నేను అమెరికాలో చదువుకోవడానికి సుమారు 43 లక్షల వరకు రుణాలు తీసుకున్నాను. నెలవారీ ఖర్చుల కోసం వీసా పోగొట్టుకుని జీవితం నాశనం చేసుకోవాడనికి నేను ఏమాత్రం ధైర్యం చేయలేకపోతున్నాను" అని చెప్పారు.

# తెలుగింటి ఉషా చిలుకూరి గురించి తెగ వెతికేస్తున్న అమెరికన్లు..

అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. అమెరికా ఉపాధ్యక్షుడిగా తెలుగింటి అల్లుడు జేడీ వాన్స్ ప్రమాణ స్వీకారం చేశారు. జేడీ వాన్స్ సతీమణి, అమెరికా రెండో మహిళ ఉషా వాన్స్ (ఉషా చిలుకూరి) గురించి ఇప్పుడు అమెరికన్లు నెట్టింట తెగ వెతికేస్తున్నారు. అసలు ఉషా వాన్స్ ఎవరు. ఆమె మతం ఏంటి. ఉషా వాన్స్ పౌరసత్వం సహా ఇతర విషయాల కోసం అమెరికన్లు గూగుల్‌లో సెర్చ్ చేస్తున్నారు.

అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఇటీవలె ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన కంటే ముందే అమెరికా ఉపాధ్యక్షుడిగా జేడీ వాన్స్ ప్రమాణ స్వీకారం జరిగింది. అయితే జేడీ వాన్స్ ప్రమాణ స్వీకారం చేస్తున్నప్పుడు పక్కనే నిలబడిన ఆయన సతీమణి, భారత సంతతికి చెందిన ఉషా వాన్స్ (ఉషా చిలుకూరి) మొహంలో హావభావాలు.. బాగా వైరల్ అయ్యాయి. తన భర్త అమెరికా ఉపాధ్యక్షుడిగా ప్రమాణం చేస్తుంటే ఉషా వాన్స్.. ముఖకవళికలు అందర్నీ ఆకర్షించాయి. ఈ వీడియో ఇంటర్నేషనల్ మీడియాతోపాటు సోషల్ మీడియాలోనూ తెగ వైరల్ అయింది. దీంతో అసలు ఆమె ఎవరు.. ఉషా వాన్స్ వివరాలు ఏంటి అని అమెరికన్లు.. ఇంటర్నెట్‌లో తెగ శోధిస్తున్నారు. ఇక ఈ పదవికి ఎంపికైన తొలి ఇండియన్ అమెరికన్, హిందూ మహిళగా ఆమె రికార్డుల్లోకి ఎక్కారు.



జేడీ వాన్స్ సతీమణి, భారత సంతతి మహిళ అయిన ఉషా వాన్స్ గురించి తెలుసుకునేందుకు గూగుల్‌లో అమెరికన్లు తెగ వెతికేస్తున్నారు. ఆమె మతం మతం ఏంటి.. ఉషా వాన్స్ పౌరసత్వం ఏంటి అనే పర్సనల్ సమాచారం కోసం సెర్చ్ చేశారు. అమెరికా కాలిఫోర్నియాలోని శాండియాగో ప్రాంతంలో పుట్టి పెరిగిన తెలుగు అమ్మాయే ఈ ఉషా చిలుకూరి. ఉషా చిలుకూరి పూర్వీకులు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా ఉంద్రాజవరం మండలంలోని వడ్లూరు గ్రామానికి చెందినవారు. ఉషా చిలుకూరి తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి అమెరికాకు వెళ్లి స్థిరపడ్డారు. 1986లో ఉష చిలుకూరి అమెరికాలోనే జన్మించారు.

యేల్ యూనివర్సిటీ నుంచి హిస్టరీలో బ్యాచిలర్ డిగ్రీ పట్టా పొందిన ఉషా చిలుకూరి.. కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి ఫిలాసఫీలో మాస్టర్స్ పూర్తి చేశారు. న్యాయ విభాగంలో చాలా కాలం ఆమె పనిచేశారు. అయితే యేల్ లా స్కూల్‌లోనే ఉషా చిలుకూరి, జేడీ వాన్స్ మొదటిసారి కలుసుకున్నారు. ఆ తర్వాత వారి మధ్య ఏర్పడిన స్నేహం ప్రేమగా మారిపోయింది. దీంతో 2014లో జేడీ వాన్స్-ఉషా చిలుకూరి.. కెంటకీలో హిందూ సంప్రదాయంలో పెళ్లి చేసుకున్నారు. జేడీ వాన్స్-ఉషా చిలుకూరి జంటకు ముగ్గురు పిల్లలు. జేడీ వాన్స్ క్రిస్టియన్ మతాన్ని.. ఉషా చిలుకూరి హిందూ మతాన్ని అనుసరిస్తుండటం విశేషం. ఇక తన కెరీర్‌లోని ప్రతీ విషయంలో ఉషా చిలుకూరి అండగా ఉంటుందని జేడీ వాన్స్ ఇప్పటికే స్పష్టం చేశారు.

అయితే తాజాగా అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. వలస వచ్చిన వారికి అమెరికాలో పిల్లలు జన్మిస్తే.. పుట్టిన వారికి సహజంగా లభించే అమెరికా పౌరసత్వాన్ని కల్పించే చట్టాన్ని రద్దు చేశారు. అయితే అమెరికాలోనే పుట్టిన ఉషా చిలుకూరి పౌరసత్వానికి.. ఈ నిర్ణయంతో వచ్చిన ముప్పేమీ లేదు. ఫిబ్రవరి 20వ తేదీ తర్వాత పుట్టిన పిల్లలకు మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుంది.

# ట్రంప్ ఆదేశాలను నిలిపేసిన అమెరికా జడ్జి..!

అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టగానే డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. అధికారంలోకి రాగానే జన్మతః లభించే పౌరసత్వాన్ని రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. దీనికి సంబంధించి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను సైతం జారీ చేశారు. అయితే ట్రంప్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అనేక రాష్ట్రాలు కోర్టుకు వెళ్లాయి. ఈ క్రమంలోనే ట్రంప్ తీసుకొచ్చిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ సియాటెల్ కోర్టు.. ట్రంప్ ఆదేశాలను తాత్కాలికంగా నిలిపేసింది.



అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టగానే డొనాల్డ్ ట్రంప్ పౌరసత్వం విషయమై కీలక ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటి దాకా అమెరికాలో పుట్టిన వారందరికీ జన్మతః పౌరసత్వం వస్తుండగా.. ఇక మీదట అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసా మీద అమెరికా వచ్చిన వారికి పుట్టబోయే పిల్లలకు జన్మతః పౌరసత్వం లభించకుండా చేసే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం చేశారు. ఈ ప్రకటనతో అమెరికాలో గ్రీన్ కార్డ్ కోసం, ఆ దేశ పౌరసత్వం కోసం ఎదురు చూస్తోన్న కోట్లాది మందిలో ఆందోళన మొదలైంది.

ఫిబ్రవరి 20 నుంచి జన్మతః పౌరసత్వం రద్దవుతుందని ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లో పేర్కొన్నారు. అయితే ట్రంప్ ఆదేశాలు అమలుకు అనేక అవాంతరాలు తలెత్తే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ట్రంప్ ఆదేశాలు అమల్లోకి రావడానికి రాజ్యాంగ సవరణ చేయాల్సి అవసరం ఉంది. జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేస్తూ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌కు వ్యతిరేకంగా ఇప్పటికే అమెరికాలోని 22 రాష్ట్రాలు, పౌర హక్కుల సంఘాలు కోర్టులో దావా వేశాయి.

దీంతో జన్మహక్కు పౌరసత్వాన్ని రద్దు చేసేందుకు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను సియాటిల్ జడ్జి తాత్కాలికంగా అడ్డుకున్నారు. అమెరికా సీనియర్ జిల్లా జడ్జి అయిన జాన్ కోహెనర్.. ట్రంప్ ఆదేశాలను నిలువరించేలా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేశారు. అమెరికాలో జన్మించిన ప్రతి వ్యక్తి అమెరికన్ పౌరుడేనని రాజ్యాంగంలో పేర్కొన్నారన్న ఆయన... ట్రంప్ చర్యలను విమర్శించారు.

"40 ఏళ్ల నా అనుభవంలో.. బెంచ్‌కు సమర్పించిన ప్రశ్న ఇంత స్పష్టంగా ఉన్న మరొక సందర్భం నాకు గుర్తులేదు. ఇది (ట్రంప్ తీసుకొచ్చింది) రాజ్యాంగ విరుద్ధమైన ఉత్తర్వు" అని న్యాయమూర్తి కోహెనర్ వ్యాఖ్యానించారు. డౌన్‌టౌన్ సియాటెల్‌లోని కోర్ట్ రూమ్‌లో మాట్లాడిన కోహెనర్.. అటార్నీ బ్రెట్ షుమేట్ మాట్లాడటం మొదలుపెట్టగానే అడ్డుతగిలారు. మీ దృష్టిలో ట్రంప్ తీసుకొచ్చిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ రాజ్యాంగబద్ధమేనా? అని ఆయన అటార్నీని సూటిగా ప్రశ్నించారు. దీనికి షుమాటే బదులిస్తూ.. ఇది కచ్చితంగా రాజ్యాంగబద్ధంగానే ఉందన్నారు. దీనికి జడ్జి బదులిస్తూ.. 'బార్‌లోని ఒక సభ్యుడు ఇది రాజ్యాంగపరమైన ఉత్తర్వు అని నిస్సందేహంగా ఎలా చెప్పగలడో అర్థం చేసుకోవడం నాకు కష్టంగా ఉంది' అన్నారు. ఇది తన మనసును కలచివేసిందన్నారు.

సియాటెల్ జడ్జి ఆదేశాల ప్రకారం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 14 రోజులపాటు బ్లాక్ చేయబడుతుంది. ఇదే సమయంలో వాషింగ్టన్, ఇతర ప్రాంతాలలో వ్యాజ్యాలు కొనసాగుతాయి. ఆ తర్వాత కోహెనర్ ప్రిలిమినరీ ఇంజెక్షన్ ఆర్డర్ ఇచ్చేలా పిటిషన్ వేసిన వాషింగ్టన్ కోరుతుంది. దీని వల్ల కేసులు ముందుకు సాగుతున్నప్పుడు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను అమలు చేయకుండా చూడవచ్చు.

# మీ లివర్ ఆరోగ్యాన్ని కాపాడతాయి..!



మనం గుండె, కిడ్నీ ఆరోగ్యంపై పెట్టిన శ్రద్ధ.. లివర్ ఆరోగ్యంపై అంతగా పెట్టం. లివర్ మన శరీరంలో ఎంతో ముఖ్యమైన అవయవం. లివర్.. మన శరీరంలో రెస్ట్ లేకుండా పనిచేస్తూనే ఉంటుంది. ఒకే సమయంలో ఎన్నెన్నో పనులను నిర్వహిస్తుంటుంది. కణజాలాలు, కండరాలు పనిచేయటానికి అవసరమైన శక్తిని అందించే గ్లూకోజు మోతాదులను నియంత్రణలో ఉండటంలో లివర్ కీలక పాత్ర పోషిస్తుంది. రక్తంలో గ్లూకోజు ఎక్కువగా ఉన్నప్పుడు దాన్ని గ్రహించి, తనలో స్టోర్ చేసుకుంటుంది. ఎప్పుడైనా గ్లూకోజు మోతాదులు పడిపోయినప్పుడు వెంటనే విడుదల చేస్తుంది. విటమిన్ ఎ, విటమిన్ డి, విటమిన్ బి12 వంటి పోషకాలను పెద్దమొత్తంలో నిల్వ చేసుకుంటుంది. తినే ఆహారం, వేసుకునే మందుల వాటిల్లో ఉండే విషతుల్యాలనూ కాలేయం ఎప్పటికప్పుడు ఫిల్టర్ చేస్తుంది. మనదేశంలో ఏటా 3 లక్షల మంది లివర్ సమస్యల కారణంగా మరణిస్తున్నారు నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో లివర్‌ను ఆరోగ్యంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. మీ లివర్‌ను ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి.. ఎలాంటి పండ్లు తీసుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం.



గ్రేప్ ఫ్రూట్.. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం, గ్రేప్ ఫ్రూట్‌లో నారింగిన్, నరింగెనిన్ వంటి యాంటీఆక్సిడెంట్‌లు ఉంటాయి. ఇవి శరీరంలో ఫ్రీరాడికల్స్ నుంచి లివర్ కణాలను రక్షిస్తాయి, బ్యాక్టీరియా నుంచి లివర్‌ను రక్షిస్తాయి. ఫ్యాటీ లివర్ కారణంగా.. లివర్‌కు కలిగే నష్టాన్ని సరిచేయడానికి గ్రేప్ ఫ్రూట్ తోడ్పడుతుంది.





యాపిల్.. రోజుకొక ఒక యాపిల్ తింటే.. లివర్ సమస్యలను దూరం చేసుకోవచ్చు. యాపిల్స్‌లో కరిగే ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది లివర్‌ను డిటాక్స్ చేస్తుంది, తద్వారా లివర్ పనితీరును మెరుగుపరుస్తుంది. యాపిల్‌లోని ఫైబర్.. లివర్ ఫ్యాట్‌ను కూడా తగ్గించడానికి తోడ్పడుతుంది. యాపిల్స్ జీర్ణక్రియ, మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి.



అవకాడో.. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఈ కొవ్వులు ఒక కవచంగా పనిచేసి, సంభావ్య నష్టం నుంచి లివర్‌ను రక్షిస్తాయి. మీ డైట్‌లో అవకాడోలో చేర్చుకుంటే.. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆస్టియోపోరోసిస్ ముప్పును నివారిస్తుంది.



బెర్రీస్.. స్ట్రాబెర్రీలు, రాస్ప్బెర్రీస్, బ్లాక్బెర్రీస్‌లు యాంటీఆక్సిడెంట్లు నిండి ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. హైపర్‌టెన్షన్, కొలెస్ట్రాల్‌ను కంట్రోల్‌లో ఉంచుతాయి. బొప్పాయి.. బొప్పాయిలో విటమిన్లు, ఎంజైమ్‌లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి గుండె, జీర్ణక్రియ, రోగనిరోధక వ్యవస్థకు మేలు చేస్తాయి. జీర్ణక్రియకు సహాయం చేయడం ద్వారా, బొప్పాయి లివర్‌పై పనిభారాన్ని తగ్గిస్తుంది. లివర్ మరింత సమర్థవంతంగా పనిచేయాడానికి సహాయపడుతుంది.

బ్లూబెర్రీస్.. బ్లూబెర్రీస్.. యాంటీఆక్సిడెంట్ల పవర్‌హౌస్. ఈ యాంటీఆక్సిడెంట్లు..లివర్ మంట, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి కీలకు పాత్ర పోషిస్తాయి. బ్లూబెర్రీస్ లివర్ ఫైబ్రోసిస్, ఫ్యాటీ లివర్‌ను కంట్రోల్‌లో ఉంచుతుందని పబ్‌మెడ్ సెంట్రల్‌లో ప్రచురించిన 2019 అధ్యయనంలో స్పష్టమైంది. ఇది లివర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

కివీ.. కివీ రోగనిరోధక శక్తిని మెరుగుపరచడమే కాదు.. లివర్ ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది. దీనిలో అధికంగా ఉండే.. మినరల్స్, విటమిన్లు.. లివర్ ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఇందులో ఫ్యాటీ లివర్ వ్యాధులను ఎఫెక్టివ్‌గా నిరోధించే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉన్నాయి.

సిట్రస్ పండ్లు.. నారింజ, నిమ్మకాయలు, బత్తాయి వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది ఇమ్యూనిటీని బూస్ట్ చేస్తుంది. సిట్రస్ పండ్లలోని పోషకాలు లివర్ ఆరోగ్యాన్ని రక్షిస్తాయి, లివర్‌ను డిటాక్స్ చేస్తుంది. ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం.

# పిల్లలు మలబద్ధకంతో బాధపడుతుంటే..



పెద్దవాళ్లలోనే కాదు.. పిల్లల్లోనూ మలబద్ధకం సమస్య ఇబ్బంది పెడుతుంది. ఈ జనరేషన్ పిల్లల్లో డిజిటల్ స్క్రీన్‌లు వాడకం ఎక్కువ అవ్వడం, శారీరక శ్రమ తగ్గిపోవడం, జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం వంటి కారణాల వల్ల చిన్నారులలోనూ మలబద్ధకం సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. మీ చిన్నారు.. టాయిలెట్‌లో ఎక్కువసేపు కూర్చుంటే, మలం విసర్జించడంలో ఇబ్బంది పడుతుంటే.. వారు మలబద్ధకంతో బాధపడుతున్నట్లు అర్థం. పిల్లలలో వారానికి మూడు లేదా అంతకంటే తక్కువ ప్రేగు కదలికలు ఉంటే మలబద్ధకంతో బాధపడుతున్నారని గుర్తించాలి. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే.. చిన్నారులలో మలబద్ధకం సమస్యను సులభంగా పరిష్కరించవచ్చని నిపుణులు చెబుతున్నారు.



డైటరీ ఫైబర్ పెంచండి.. మలబద్ధకం సమస్యకు చెక్ పెట్టడానికి డైటరీ ఫైబర్ ప్రభావవంతంగా పనిచేస్తాయి. మీ చిన్నారి డైట్‌లో డైట్‌రీ ఫైబర్ పుష్కలంగా ఉండే.. తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు చేర్చండి. ఫైబర్ పేగు కదలికలను మెరుగుపరుస్తుంది, స్టూల్ మూవ్‌మెంట్‌ను సులభతరం చేస్తుంది. యాపిల్స్, బేరి, జామకాయ వంటి ఫైబర్-రిచ్ స్నాక్స్ ఇవ్వండి. పిల్లలు స్మూతీలను చాలా ఇష్టంగా తాగుతుంటారు. మీ చిన్నారికి ఫైబర్ రిచ్ స్మూతీలను ఇవ్వొచ్చు. అరటిపండ్లు, స్ట్రాబెర్రీలు, పెరుగు, చియా సీడ్స్ వేసి టేస్టీ.. టేస్టీ స్మూతీ రెడీ చేసి వారికి ఇవ్వండి.

హైడ్రేట్‌గా ఉంచండి.. సరిపడా నీళ్లు తాగకపోయినా.. మలబద్ధకం సమస్య ఎదురయ్యే అవకాశం ఉంది. మీ చిన్నారి సరిపడా నీళ్లు తాగుతున్నాడో లేదో చూసుకోండి. రోజుకు కనీసం 6 కప్పుల నీళ్లు తాగేలా చూసుకోండి. శరీరం హైడ్రేట్‌గా ఉంటే.. స్టూల్ మృదువుగా అవుతుంది, దీంతో స్టూల్ మూవ్‌మెంట్ సులభంగా జరుగుతుంది. వారిని హైడ్రేట్‌గా ఉంచడానికి.. ఫ్రెష్ ఫ్రూట్ జ్యూస్‌లు, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు ఇవ్వొచ్చు.



ప్రోబయోటిక్స్ చేర్చండి.. ప్రోబయోటిక్స్ జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి, గట్‌ను ఆరోగ్యంగా ఉంచుతాయి. మీ పిల్లలు మలబద్ధకంతో బాధపడుతుంటే.. ఆహారంలో ప్రోబయోటిక్స్ ఎక్కువగా ఉండే పెరుగు, మజ్జిగ, యోగర్ట్ ఎక్కువగా ఇవ్వండి. ప్రొబయోటిక్స్ పేగులలో మంచి బ్యాక్టీరియాను పెంచుతాయి, ఇవి జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి.



రెగ్యూలర్ టాయిలెట్ రొటీన్‌ను అలవాటు చేయండి.. మీ చిన్నారికి.. రెగ్యూలర్ టాయిలెట్ రొటీన్‌ను అలవాటు చేయండి. ప్రతి రోజు ఒకే సమయంలో టాయిలెట్‌ని ఉపయోగించేలా చేయండి. మీ బిడ్డను రోజుకు కనీసం రెండుసార్లు 10 నిమిషాల పాటు టాయిలెట్‌లో కూర్చోబెట్టండి. వారు టాయిలెట్ సీటు వద్దకు ఫోన్‌లు, ఇతర ఆట బొమ్మలు తీసుకువెళ్లకుండా చూసుకోండి. ఈ రొటీన్ ఆరోగ్యకరమైన పేగు కదలికలను ప్రోత్సహిస్తుంది, మలబద్ధకాన్ని నివారిస్తుంది.

గోరువెచ్చని నీరు తాగించండి.. ప్రతి రోజూ ఉదయం, మీ పిల్లలకు ఒక గ్లాసు గోరువెచ్చని నీరు ఇవ్వండి. అలాగే రాత్రిపూట 4 నానబెట్టిన ఎండు ద్రాక్ష ఇవ్వండి. వాళ్లు నిద్రపోయే ముందు ఆవు పాలలో నెయ్యి వేసి తాగించండి. . మలబద్ధకం కారణంగా వాళ్లు గ్యాస్, కడుపు ఉబ్బరంతో బాధపడుతుంటే.. కడుపుపై ఇంగువ రాయండి. మీ చిన్నారి మలబద్ధకంతో బాధపడుతుంటే.. పచ్చి, వేయించిన ఆహారానికి బదులుగా.. ఉడికించిన ఆహారం ఇవ్వడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వండి. ఉడికించిన ఆహారం త్వరాగ జీర్ణం అవుతాయి. వారి ఆహారంలో చక్కెర పరిమాణం తగ్గించండి. జంక్, ప్రాసెస్ చేసిన ఆహారానికి దూరంగా ఉంచండి.

# ఈ డ్రింక్స్ తాగితే.. కళ్లు బాగా కనిపిస్తాయ్..!

సర్వేంద్రియానం నయనం ప్రధానం' అని పెద్దలు అంటుంటారు. కళ్లు మూసుకుని నడిస్తే.. పట్టుమని పది అడుగులు కూడా వేయలేం. నం ఏ పని చేయాలన్నా చూపు చాలా కీలకం. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులు, కాలుష్యం, ఆహారపు అలవాట్లు, డిజిటల్‌స్క్రీన్ల వాడకం ఎక్కువ అవ్వడం వంటి కారణాల వల్ల కంటికి అనేక చిక్కులు వస్తున్నాయి. చాలామందికి కంటి చూపు క్షీణిస్తుంది. కంటి ఆరోగ్యాన్ని రక్షించడానికి, కంటి చూపును ప్రోత్సహించడానికి పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుంది. మీ కంటి చూపును మెరుగుపరిచే.. హెల్తీ డ్రింక్స్‌గురించి ఈ స్టోరీలో తెలుసుకుందాం.

ఏబీసీ జ్యూస్.. ఆపిల్, బీట్‌రూట్, క్యారెట్‌లతో చేసింది కనుక దీనికి 'ఏబీసీ' జ్యూస్‌అని పేరు. ఈ మూడింటినీ సమపాళ్లలో తీసుకొని ఒక గ్లాసు ప్రతిరోజూ ఉదయాన్నే తీసుకోవాలి. క్యారెట్‌లో బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది, ఇది శరీరంలో విటమిన్ ఎగా మారుతుంది, విటమిన్ ఏ మొత్తం కంటి ఆరోగ్యానికి ఎంతో అవసరమైన పోషకం. బీట్‌రూట్‌లో లుటిన్, జియాక్సంతిన్ ఉంటాయి. ఈ పోషకాలు మాక్యులర్, రెటీనా ఆరోగ్యానికి తోడ్పడతాయి. యాపిల్స్‌లో బయోఫ్లేవనాయిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి కంటి చూపును మెరుగుపరుస్తాయి.





పాలకూర, కాలే, బ్రకోలీ.. పాలకూర, కాలే, బ్రకోలీలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్‌నుంచి కంటిని రక్షిస్తాయి, అంతేకాదు, కంటి ఆరోగ్యానికి మద్దతు ఇస్తాయి. ఈ జ్యూస్‌లోని లుటీన్, జియాక్సంతిన్‌లు రెటీనాకు హాని కలిగించే.. బ్లూ లైట్‌నుంచి కంటిని రక్షిస్తాయి. పాలకూర, కాలే, బ్రకోలీతో చేసిన జ్యూస్‌తరచూ తాగితే.. మీ కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.



బెర్రీ స్మూతీ.. బెర్రీ స్మూతీ హెల్తీనే కాదు.. టేస్టీగా కూడా ఉంటుంది. బెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. అవి శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడితో పోరాడటానికి సహాయపడతాయి, కంటిని ఫ్రీరాడికల్స్‌నుంచి రక్షిస్తాయి. వయస్సుతో, కంటిలోని అనేక భాగాలు క్షీణిస్తాయి. కానీ బెర్రీలు ఈ ప్రక్రియను నెమ్మదిస్తాయి, కంటి ఆరోగ్యాన్ని కాపాడతాయి. రకరకాల బెర్రీలతో స్మూతీ తయారు చేసుకుని ఎంజాయ్‌చేయండి.

ఆరెంజ్ జ్యూస్.. ఆరెంజ్‌జ్యూస్‌లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది కంటిలోని రక్తనాళాలను బలంగా, స్థిరంగా ఉంచుతుంది. విటమిన్‌సి కంటిశుక్లం ఏర్పడే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆరెంజ్‌లో ఫోలేట్‌ఉంటుంది.. ఇది కడుపులో బిడ్డ దృష్టి అభివృద్ధి సమయంలో తోడ్పడుతుంది. గర్భిణులు రోజు ఉదయం పూట ఆరెంజ్‌జ్యూస్‌తాగాలని నిపుణులు సూచిస్తున్నారు.

కొబ్బరి నీళ్లు.. కొబ్బరి నీళ్లలో విటమిన్ సీ, మినరల్స్‌తో పాటు అమైనా యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి కంటి రక్షిత కణజాలాలను మెరుగుపరచడానికి సహాయపడతాయి. కొబ్బరి నీళ్లు రోజూ తాగితే.. రక్తనాళాలు, ఆప్టిక్ నరాలకు మంచి జరుగుతుంది.

నిమ్మరసం నీళ్లు.. లెమన్ జ్యూస్‌లోని ల్యూటిన్, జియాంత్సంతిన్ ఎక్కువ పాళ్లలో ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మీ కంటి ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి రోజూ నిమ్మరసం నీళ్లు తాగండి.

# పిల్లలకు గాయాలైతే.. ఇంట్లోనే ట్రీట్మెంట్...



పిల్లలు ఆడుతు న్నప్పుడు, గెంతుతున్నప్పుడు పడిపోతూ ఉంటారు, దీంతో వాళ్లకు గాయాలు అవుతూ ఉంటాయి. ఇంట్లోనే పిల్లల గాయాలకు ఎలా ట్రీట్మెంట్ చేయాలో ఈ స్టోరీలో చూద్దాం.

పిల్లలన్నాక అల్లరి చేయడం కామన్.. ఆ అల్లరిలో దెబ్బలు తగిలించుకోవడమూ మామూలే. అంతేకాదు, , సైకిల్ తొక్కేప్పుడు, పరిగెడుతున్నప్పుడు, గెంతుతున్నప్పుడూ కిందపడి దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు. దీంతో దెబ్బలు తగిలి రక్తకారడం, చర్మం కొట్టుకపోవడం, కందిపోవటం, చర్మం గీసుకుపోవటం చూస్తునే ఉంటాం. మరీ పెద్ద గాయాలేతై.. డాక్టర్ దగ్గరకు కచ్చితంగా తీసుకువెళ్లాలి. చిన్నగాయాలకు ఇంట్లోనే ట్రీట్మెంట్ చేయవచ్చు. పిల్లలకు గాయాలైనప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి చికిత్స అందించాలో ఈ స్టోరీలో చూద్దాం. పిల్లలకు తగిలిన గాయం తగిలే ముందు.. చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. . లేకపోతే చేతులకు ఉన్న సూక్ష్మక్రిములు గాయానికి అంటుకుని.. ఇన్ఫెక్షన్ అయ్యే ప్రమాదం ఉంది.

గాయం నుంచి రక్తం కారటం ఆగకపోతే.. కాటన్‌తో అదిమి పట్టాలి. నెమ్మదిగా రక్తం కారటం ఆగుతుంది. చాలామంది గాయాన్ని శుభ్రం చేయకుండానే, దానిపై హైడ్రోజన్ పెరాక్సైడ్ గానీ స్పిరిట్ గానీ వేస్తూ ఉంటారు. ఇలా చేస్తే.. గాయం త్వరగా మానదు. గాయం నుంచి రక్తం కారటం ఆగిన తర్వాత.. శుభ్రమైన నీటితో కడగాలి. ఆ తర్వాత.. హైడ్రోజన్ పెరాక్సైడ్ గానీ స్పిరిట్ వేసి, యాంటీబయాటిక్ క్రీమ్ రాయాలి. ఆ తర్వాత.. గాయాన్ని శుభ్రమైన నీటితో కడగాలి. ఆ తర్వాత.. ఇన్‌ఫెక్షన్ తలెత్తకుండా చేస్తుంది. గాయం మీద బ్యాండేజీ గుడ్డతో కట్టు కట్టాలి. బ్యాండేజీని రోజూ మార్చి, కొత్తది కట్టాలి.



ప్రతిసారీ గాయాన్ని శుభ్రం చేసి యాంటీబయాటిక్ క్రీమ్ రాయాలి. చెక్కు కట్టేంతవరకూ గాయం మీద నేరుగా కొబ్బరి నూనె వంటివేవీ రాయొద్దు.

చెక్కు కట్టిన తర్వాత అక్కడ దురద పెడుతుంటుంది. దీంతో గోకటానికి, చెక్కును తీయటానికి పిల్లలు ప్రయత్నిస్తుంటారు. ఇలాంటి పనులు చేయకుండా చూసుకోవాలి.



గాయం మరీ పెద్దగా, లోతుగా అయినట్టయితే డాక్టర్‌ను సంప్రదించటం మంచిది. ఎందుకంటే కొన్నిసార్లు కుట్లు వేయాల్సి రావొచ్చు. యాంటీబయాటిక్ మాత్రలు అవసరపడొచ్చు.

చాలాసార్లు.. పిల్లలకు గాయాలు అయినప్పుడు చర్మం కందిపోయి నల్లగా, నీలంగా మారుతుంది. అలాంటి సందర్భాల్లో కందిన ప్రాంతంలో ఐస్ ప్యాక్ పెట్టాలి. ఐస్ ముక్కలను న్యాప్‌కిన్ లేదా తువ్వాలులో చుట్టి కందిన చోట 15-20 నిమిషాల సేపు పెట్టి ఉంచాలి. గాయం తగిలని రోజు.. నాలుగైదు సార్లు ఇలా చేస్తే వాపు తగ్గుతుంది. నొప్పి కూడా తగ్గిస్తుంది. గాయం అయిన మరుసటి రోజు.. వేడి నీళ్లతో కాపడం పెట్టండి. ఇలా చేస్తే.. చర్మం నార్మల్ అవుతుంది.

# పిల్లలు మాట వినకపోతే..



కొన్నిసార్లు పిలల్లు మాట వినరు. అలాంటప్పుడు వారిని తిట్టడం కొట్టడం లాంటివి చేయకుండా కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అవేంటో తెలుసుకోండి. ఇలాంటి వాటి వల్ల పిల్లలు చాలా వరకూ మీ మాట వింటారు. పిల్లలు మన మాట వినాలంటే మనకి కొద్దిగా ఓపిక అవసరం. వారు మాట వినకపోతే కోపం రావడం సహజం. అయితే, దానిని పిల్లలపై రుద్దకూడదు. దీంతో వారు ఇంకా మొండిగా మారే అవకాశం ఉంది. కళ్ళు చూస్తూ.. పిల్లలకి ఏదైనా చెబుతున్నప్పుడు వారి కళ్ళు చూస్తూ మాట్లాడాలి. అలా చేస్తేనే వారికి అది ఇంపార్టెన్స్ అని అర్థమవుతుంది. వారిని చక్కగా పిలవండి. ఎంత ప్రేమగా పిలిస్తే వారు మీ దగ్గరికి వస్తారు. అంతేకానీ, కోపంగా పిలవకూడదు. అలా చేయొద్దు, ఇలా చేయొద్దు అని ఆంక్షలు పెట్టే బదులు.. వారికి అలా చేస్తే ఏమవుతుందో సర్ది చెప్పాలి. అప్పుడు వారు మీ మాట వింటారు. ఏదైనా ఎంచుకునేటప్పుడు వారికి అవకాశం ఇవ్వాలి. వారికి ఛాన్స్ ఇవ్వండి. ఏది కావాలో అది తీసుకోమని చెప్పండి. దీంతో వారికి కూడా ఛాన్స్ ఇచ్చారని అర్థమవుతుంది.

మెచ్చుకోవడం.. అదే విధంగా వారు ఏదైనా పనిచేసినప్పుడు వారిని మెచ్చుకోండి. దీని వల్ల వారికి ఓ రకమైన ఎంకరేజింగ్ ఉండి వారు మరిన్ని మంచి పనులు చేసేందుకు హెల్ప్ చేస్తాయి.

అప్పుడప్పుడు కోపం.. అదే విధంగా వారు మరి మొండిగా ఉన్నప్పుడు చిన్న చిన్న శిక్షలు వేయాలి. దీంతో వారికి శారీరకంగా, మానసికంగా ఉండొద్దు. అవి కూడా వారికి ఏదో యాక్టివిటీగా ఉండాలి. బొమ్మలు గీయడం లాంటివి చెప్పాలి.

మీరు కూడా అలానే.. వారు సరిగ్గా ఉండాలంటే ముందుగా మీ ప్రవర్తన సరిగ్గా ఉండాలి. ఎందుకంటే వారే మీకు రోల్ మోడల్స్ కాబట్టి. అందుకే వారికి మీరు ఏమైనా చెప్పినప్పుడు వాటిని మీరు ఫాలో అవ్వడం నేర్చుకోండి. కచ్చితంగా వారు కూడా మిమ్మల్ని చూసి నేర్చుకుంటారు.

కారణాలు తెలుసుకోవడం.. వారు మాట వినకపోతే కారణం ఏంటో కనుక్కుని వాటిని పరిష్కరించే ప్రయత్నం చేయాలి. ఈ టిప్స్ ఫాలో అయితే వారు కచ్చితంగా మీ మాట వింటారు. ఇలా మెల్లిగా ఒక్కొక్కటి చెప్పి వారు మీ మాట వినేలా చేయండి. అంతేకానీ, కోప్పడి, చిరాకు పడితే వారు ఇంకా మొండిగా మారతారు. కోప్పడొద్దు. నెమ్మదిగా వారికి అర్థమయ్యేలా చెప్పండి. ఏదైనా బాగా చేస్తే మెచ్చుకోవడం, గిఫ్ట్ ఇవ్వడం వంటివి చేయండి. ఇతరుల ముందు అస్సలు వారిని తక్కువగా చేసి మాట్లాడడం వేరేవారితో పోల్చడం చేయొద్దు.

# శ్రీలీల సక్సెస్ వెనుక జూ.ఎన్టీఆర్..



హీరోయిన్ శ్రీలీల డాన్స్ ప్రతిభకు జూనియర్ ఎన్టీఆర్ ప్రేరణ అని ఆమె తల్లి స్వయంగా వెల్లడించారు. ఇటీవల జయమ్మ నిశ్చయమ్మురా టాక్ షోలో మాట్లాడుతూ.. చిన్ననాటి ఎన్టీఆర్ భరతనాట్యం చేస్తున్న ఫోటోను చూసి, తనకెప్పుడైనా ఆడపిల్ల పుడితే ఇలాగే డాన్స్ నేర్పించాలి అని అప్పుడే నిర్ణయించుకున్నానని చెప్పారు. ఈ విషయాన్ని తానా సభల్లో ఎన్టీఆర్‌కే చెప్పినట్లు గుర్తుచేశారు. ఆ ఆలోచనతోనే శ్రీలీలకు చిన్నప్పటి నుంచి డాన్స్ ట్రైనింగ్ ఇచ్చారని వెల్లడించారు.

ప్రస్తుత తరంలో తెలుగు సినీ ఇండస్ట్రీలో బెస్ట్ డ్యాన్సర్ ఎవరు అంటే ఎక్కువ మంది జూనియర్ ఎన్టీఆర్ అని చెబుతారు. చిన్నతనంలోనే కూచిపూడి డ్యాన్స్ నేర్చుకున్న ఎన్టీఆర్ ఎన్నో వేదికలపై ప్రదర్శనలు ఇచ్చి మరెంతో మందికి స్ఫూర్తిగా నిలిచాడు. సినిమాల్లో డ్యాన్స్‌తో ఇరగదీసే శ్రీలీలకి కూడా ఆయనే ప్రేరణ అన్న విషయం మాత్రం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని ఆమె తల్లి డాక్టర్ స్వర్ణలత స్వయంగా తెలిపారు.

సీనియర్ నటుడు జగపతిబాబు హోస్ట్‌గా 'జయమ్మ నిశ్చయమ్మురా' టాక్ షో ఇటీవలే మొదలైన సంగతి తెలిసిందే. ఫస్ట్ ఎపిసోడ్‌కి గెస్ట్‌గా అక్కినేని నాగార్జున హాజరై తన జీవితానికి సంబంధించిన అనేక సంగతులు పంచుకున్నారు. రెండో ఎపిసోడ్‌కి హీరోయిన్ శ్రీలీల గెస్ట్‌గా వచ్చింది. ఈ షోలో తన చిన్ననాటి విషయాల నుంచి హీరోయిన్ అయినప్పటి వరకు ఎన్నో సంగతుల్ని జగపతిబాబుతో షేర్ చేసుకుంది.

శ్రీలీల సంగతులు చెప్పడానికి ఆమె తల్లి డాక్టర్ స్వర్ణలత కూడా వేదికపైకి వచ్చారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌తో తనకున్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ చిన్నతనంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చిన ఫోటోను జగపతి బాబు చూపించగానే స్వర్ణలత పాత విషయాల్లోకి వెళ్లిపోయారు. 1997 లాస్ ఏంజెల్స్‌లో జరిగిన తానా సభల్లో ఎన్టీఆర్ నృత్య ప్రదర్శనని తిలకించాను. అప్పుడే ఆయన్ని కలిసి మాట్లాడాను. ఆ తర్వాతే నాకు కూతురు పుడితే కచ్చితంగా డ్యాన్సర్‌ని చేయాలని నిర్ణయించుకున్నాను. అనుకున్నట్లే నాకు కూతురు పుట్టడంతో తనకి డ్యాన్స్ నేర్పించాను. అలా ఎన్టీఆర్ స్ఫూర్తితోనే శ్రీలీల మంచి డ్యాన్సర్ అయింది' అని స్వర్ణలత చెప్పుకొచ్చారు.

# మళ్లీ పోలీస్ యూనిఫామ్



కొంతమంది హీరోలని పోలీస్ యూనిఫామ్‌లో చూస్తే ముచ్చటేస్తుంది. వారు అలాంటి పాత్రల కోసమే పుట్టారేమో అనిపిస్తుంటుంది. అలాంటి హీరోల్లో సూర్య ఒకరు. తెరపై ఆయన పోలీస్ గెటప్ వేస్తే ప్రేక్షకులు విజిల్స్ కొడతారు. సూర్య బాడీ లాంగ్వేజ్ ఆ పాత్రలకి అచ్చుగుద్దినట్లు సరిపోతుంది. పోలీస్ ఆఫీసర్‌గా సూర్య చాలా సినిమాలే చేశాడు. 2023లో వచ్చిన గౌతమ్ మీనన్ డైరెక్షన్లో వచ్చిన 'కాక్కకాక్క' సూర్య పోలీసుగా అదరగొట్టేశాడు. ఈ మూవీయే తెలుగులో 'ఘర్షణ'గా రీమేక్ అయింది. ఇక సింగం సిరీస్ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఈ సిరీస్‌లో మూడు చిత్రాలు రాగా తమిళంతో పాటు తెలుగులోనూ ఒకదానికొకటి మించి హిట్టయ్యాయి. ఇందులో సూర్య అగ్రెసివ్ యాక్టింగ్, యాక్షన్ సీక్వెన్స్ అదిరిపోతాయి. తొలి సినిమా(తెలుగులో 'యముడు') మూరుమూల పోలీస్‌స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉండే సూర్య.. మూడో పార్ట్ దగ్గరికొచ్చేసరికి సూపర్‌కాప్‌గా మారిపోతాడు. అతడి తెగువ, ధైర్య సాహసాలకు విదేశీ పోలీసులు సైతం సెల్యూట్ చేస్తారు. ఈ సిరీస్‌లో నాలుగో పార్ట్ కోసం ప్రేక్షకులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. ఇటీవల వరుస ఫ్లాపుల్లో ఉన్న సూర్య.. 'సింగం 4' తీస్తే మళ్లీ విజయాల బాట పడతాడని ఆయన ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

తాజాగా విషయానికొస్తే.. సూర్య మరోసారి పోలీస్ యూనిఫామ్ వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. అయితే అది 'సింగం 4' కోసం కాదు. మలయాళ దర్శకుడు జీతూ మాధవన్ తెరకెక్కించే ఈ చిత్రంలో సూర్య పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. సూర్యకి 47వ సినిమాగా రానున్న ఈ చిత్రాన్ని సూర్య సొంత బ్యానర్ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించనుంది. ఈ సినిమాకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నారు. ఈ ఏడాది చివర్లో షూటింగ్ మొదలుకానున్నట్లు కోలీవుడ్ వర్గాల సమాచారం. 'కంగువా'తో పాన్ ఇండియా రేంజ్ హిట్టు కొట్టాలని ప్రయత్నించి బొక్కబోర్లా పడ్డ సూర్య.. ఇటీవల 'రెట్రో' వచ్చి నిరాశ పరిచాడు. విలక్షణ నటుడిగా పేరొందిన అతడు ఇటీవల కాలంలో రొటీన కథలు ఎంచుకోవడంతోనే దెబ్బతింటున్నాడని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రస్తుతం కోలీవుడ్‌లో ఓ శూన్యత కనిపిస్తోంది. నంబర్‌వన్ హీరోగా ఉన్న విజయ్ రాజకీయాల్లోకి వెళ్లడంతో ఇకపై సినిమాలు చేయనని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆయన చివరిగా నటిస్తోన్న 'జననాయగన్' మూవీ సంక్రాంతికి రానుంది. 2026లో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఆ ఫలితాన్ని బట్టి విజయ్ నిర్ణయం మారొచ్చు. ఒకవేళ ఆయన ఎమ్మెల్యేగా గెలిచి నిర్ణయాత్మక శక్తిగా ఎదిగితే మాత్రం ఇక సినిమాలు చేయకపోవచ్చు. ఇక మరోస్టార్ అజిత్ ఓ వైపు సినిమాలు మరోవైపు రాక్ రేసులతో బిజీగా ఉంటున్నారు. తన సినిమాలేదో తాను తీసుకోవడం తప్ప ఆయనకు నంబర్‌వన్ రేసుపై ఆసక్తి లేదు. ఇక సీనియర్ హీరోలైన రజినీకాంత్ వరుసగా సినిమాలు లైన్లో పెడుతున్నా ఆయన వయసు 75 ఏళ్లు. త్వరలోనే రజినీ సినిమాలకు రిటైర్‌మెంట్ ప్రకటిస్తారన్న ప్రచారం సాగుతోంది. మరో సీనియర్ హీరో కమల్‌హాసన్ ఇటీవల ఇండియన్ 2, థగ్‌లైఫ్ వంటి డిజాస్టర్లు ఎదుర్కోవడంతో మార్కెట్ పూర్తిగా పడిపోయింది. ప్రస్తుతం ఆయనతో సినిమాలు తీసేందుకు ఎవరూ ఆసక్తి చూపించడం లేదు. పైగా ఇటీవలే ఆయన డీఎంకే పార్టీ తరపున రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఇలా కోలీవుడ్‌లో ఓ శూన్యత కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే సూర్య మంచి కథలు ఎంపిక చేసుకుని విజయాలు అందుకుంటే తమిళంలో నంబర్ హీరోగా అవతరించే అవకాశం దక్కుతుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# బ్యాడ్‌లక్ కంటిన్యూ..



దుల్కర్ సల్మాన్‌తో నటించే అవకాశాన్ని పూజా హెగ్డే కోల్పోయిందన్న టాక్ ఫిల్మ్‌నగర్‌లో చక్కర్లు కొడుతోంది. అధికారికంగా ఆమె తప్పుకుందని చెప్పకపోయినా, ఇండస్ట్రీ వర్గాలు మాత్రం "పూజాను టీమ్‌నే తీసేసింది" అని గుసగుసలాడుతున్నాయి. ఆమె ప్లేస్‌లో శృతి హాసన్‌ను తీసుకోవాలని యోచిస్తున్నారని, త్వరలోనే ప్రకటన వెలువడే అవకాశముందని సమాచారం. వరుసగా ఫ్లాపుల్లో కూరుకుపోయిన పూజాకు ఇది మరో పెద్ద దెబ్బగానే భావిస్తున్నారు. ఫ్లాపుల్లో కూరుకుపోయిన పూజా పాపను పైకి లాగే నాథుడు ఎవరు అని అటు ఇండస్ట్రీ.. ఇటు అభిమానులు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు.

సినీ ఇండస్ట్రీ అంటేనే మాయా ప్రపంచం. అక్కడ ఎప్పుడు ఎవరు స్టార్లు అవుతారో, స్టార్లుగా ఉన్నవారు ఎప్పుడు కింద పడిపోతారో చెప్పడం కష్టం. ఎన్ని ఫ్లాపులు వచ్చినా హీరోలు ఇండస్ట్రీని పట్టుకుని వేలాడుతూనే ఉంటారు. కానీ హీరోయిన్లు విషయంలో మాత్రం అలా జరగదు. హిట్లు వచ్చినంత వరకే వాళ్లకి స్టార్‌డమ్. ఒక్క ఫ్లాప్ వచ్చిందంటే ఐరన్‌లెగ్ ముద్ర వేసేసి ఛాన్సులు ఇవ్వడానికే జంకుతారు. ప్రస్తుతం బుట్టబొమ్మ పూజా హెగ్డే పరిస్థితి అలాగే ఉంది. మోడలింగ్ నుంచి సినిమాల్లోకి వచ్చిన పూజా 2014లో 'ముకుంద', 'ఒక లైలా కోసం' చిత్రాలతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. తొలినాళ్లలో వరుస ఫ్లాపులతో సతమతమైనా ఆ తర్వాత దువ్వాడ జగన్నాథం, అరవింద సమేత, మహర్షి, గద్దలకొండ గణేష్, అల వైకుంఠపురములో, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ చిత్రాలతో వరుస హిట్లు కొట్టి స్టార్ హీరోయిన్ అయిపోయింది. అదే ఊపులో ప్రభాస్‌తో 'రాధేశ్యామ్', రామ్‌చరణ్‌తో 'ఆచార్య' తమిళంలో విజయ్ సరసన 'బీస్ట్' చిత్రాలు చేయగా అన్నీ డిజాస్టర్లుగా నిలిచాయి. దీంతో పూజాపై ఐరన్ లెగ్ ముద్ర పడిపోయింది. ఆమెతో సినిమా చేసేందుకు నిర్మాతలు వెనుకాడారు. రూటు మార్చి బాలీవుడ్‌కి వెళ్లినా అక్కడా నిరాశ ఎదురైంది. ప్రేక్షకులు ఆమె అందాల్ని ఆస్వాదించారు గానీ సినిమాలని మాత్రం పట్టించుకోలేదు. దీంతో కొంత బ్రేక్ తర్వాత తనకు లైఫ్ ఇచ్చిన సౌత్‌పైనే కన్నేసింది. సూర్య సరసన 'రెట్రో'లో ఛాన్స్ కొట్టేయడంతో తన కెరీర్ మళ్లీ పుంజుకుంటుందని ఊహించుకుంది. ఆ సినిమా తేడా కొట్టేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. 'కూలీ'లో మోనికా అంటూ స్టెప్పులతో ఓ ఊపు ఊపేసింది. ఈ సాంగ్ యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లోకి రావడంతో అవకాశాలు పెరుగుతాయని ఆశలు పెట్టుకుంది. అయితే 'కూలీ' థియేటర్లలో మెప్పించలేకపోవడంతో పూజాకి నిరాశే ఎదురైంది.


ఏదొకటి చేసి మళ్లీ అవకాశాలు దక్కించుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేసిన పూజా హెగ్డేకి ఊహించని అవకాశం వచ్చింది. దుల్కర్ సల్మాన్ హీరోగా రవి నేలకుడితి అనే కొత్త దర్శకుడి తెరకెక్కిస్తోన్న చిత్రంలో ఆమెకు ఛాన్స్ వచ్చింది. దీంతో తెలుగులో ఎలాగైనా మళ్లీ పాగా వేయాలని భారీ ఆశలే పెట్టుకుంది. అయితే తాజాగా వినిపిస్తోన్న టాక్ ప్రకారం ఈ మూవీలో పూజా నటించడం లేదట. ప్రాజెక్టు నుంచి తానే తప్పుకుందా.. లేక మేకర్స్ తీసేశారా అన్నది క్లారిటీ లేకపోయినా ఈ పరిణామం పూజాకి పెద్ద దెబ్బేనని చెప్పొచ్చు. పూజా హెగ్డే ప్లేస్‌లో శ్రుతిహాసన్‌ని తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే పూజా బ్యాడ్‌లక్ కంటిన్యూ అవుతున్నట్లేనని చెప్పొచ్చు. ప్రస్తుతం ఆమె పరిస్థితిని చూసి కొందరైతే హాయిగా పెళ్లి చేసుకుని ఎంజాయ్ చేయాలని ఆమెకు ఉచిత సలహాలు ఇస్తున్నారు.

# ఇండియాలోనే ఫస్ట్ హీరోగా..



టాలీవుడ్ సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణకు అరుదైన గౌరవం దక్కింది. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గోల్డ్ ఎడిషన్‌లో ఆయన చోటు దక్కించుకున్నారు. భారతీయ చలన చిత్ర పరిశ్రమలో ఈ పురస్కారానికి ఎంపికైన తొలి నటుడిగా బాలయ్య నిలిచారు. 50 ఏళ్లకుపైగా సినీ ప్రస్థానం సాగిస్తున్నందుకుగానూ ఆయన ఈ అవార్డు వరించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఆగస్టు 30న బాలకృష్ణను సత్కరించనున్నారు.

# అడ్వాన్స్ బుకింగ్స్... ఎప్పటి నుంచంటే!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ ఓజీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'హరిహర వీరమల్లు' నిరాశ కలిగించిన నేపథ్యంలో ఈ సినిమా కోసం పవర్ స్టార్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఆగస్టు 29 నుంచి యూఎస్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయని, సెప్టెంబర్ 24న ప్రీమియర్ షోలు జరుగుతాయని అమెరికా డిస్ట్రిబ్యూటర్ ప్రత్యంగిరా సినిమాస్ ప్రకటించింది. ఇదే విషయాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ స్పష్టం చేసింది. దీంతో రిలీజ్‌పై మరోసారి క్లారిటీ వచ్చింది. ఇటీవలే 'హరిహర వీరమల్లు ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ . అయితే ఆ చిత్రం ఆశించిన విజయం సాధించకపోవడంతో ఆయన అభిమానులు ఫీలయ్యారు. అయితే అభిమానుల్ని అలరించేందుకు పవన్ మరో చిత్రంలో సిద్ధమవుతున్నారు. సుజిత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మిస్తోన్న 'ఓజీ' చిత్రం దసరా కానుకగా సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో పవన్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్, గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ సినిమాపై అంచనాల్ని భారీగా పెంచేశాయి. అయితే సినిమా షూటింగ్ కాస్త పెండింగ్ ఉండటం వల్ల 'ఓజీ' రిలీజ్ వాయిదా పడనుందంటూ వార్తలొస్తుండగా మేకర్స్ వాటిని ఖండిస్తున్నారు. తాజాగా వచ్చిన అప్‌డేట్ ప్రకారం 'ఓజీ' సెప్టెంబర్ 25న రిలీజ్ కావడం ఖాయమైంది. ఈ నేపథ్యంలోనే ఈ నెల 29వ తేదీ నుంచి ఓవర్సీస్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. ఈ చిత్రాన్ని ఓవర్సీస్‌లో ప్రత్యంగిరా సినిమాస్ సంస్థ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. ఓవర్సీస్‌లో ఒకరోజు ముందుగానే అంటే సెప్టెంబర్ 24నే ప్రీమియర్ షోలు వేయనున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది.

# రూ.100 కోట్ల డీల్..

ఎలాంటి అంచనాలు లేకుండా పాన్ ఇండియా రేంజులో బ్లాక్‌బస్టర్ హిట్టు కొట్టింది 'కాంతార' మూవీ. కన్నడ నేటివిటీతో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగుతో పాటు నార్త్‌లోనూ హవా చూపించింది. నిర్మాతలకు పదిరెట్ల లాభాన్ని తెచ్చిపెట్టింది. ఈ మూవీలో హీరోగా నటించిన రిషబ్‌శెట్టి నటనతోనే కాకుండా దర్శకుడిగా టేకింగ్‌తోనూ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాడు. ఆ చిత్రంలో నటనకు గాను జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు సైతం అందుకున్నాడు. ఈ నేపథ్యంలోనే ఈచిత్రానికి రెండో భాగం ఎప్పుడెప్పుడు వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే 'కాంతార'కు ప్రీక్వెల్‌గా ' కాంతార చాప్టర్ 1 'ని తెరకెక్కించాడు రిషబ్‌శెట్టి. ఇందులో 'కాంతార' కథకి ముందు ఏం జరిగిందో చూపించనున్నారు. అక్టోబర్ 2న విడుదల కానున్న ఈ చిత్రానికి సంబంధించి థియేట్రికల్ రైట్స్‌కి సంబంధించి ఓ వార్త ఇప్పుడు హల్‌చల్ల చేస్తోంది.



'కాంతార' చిత్రాన్ని గీతా ఫిలింస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ కింద అల్లు అరవింద్ కేవలం రూ.2 కోట్లకు తెలుగు హక్కులు పొందారు. అయితే ఈ చిత్రం సుమారు రూ.30 కోట్లకు పైగా గ్రాస్, 15 కోట్లకు పైగా నెట్ వసూలు చేసింది. దీంతో అల్లు అరవింద్ సుమారు ఐదు రెట్లకు పైగా లాభాలు చవిచూశారు. ఇప్పుడు 'కాంతార చాప్టర్ 1'పై భారీ అంచనాలు ఉండటంతో ఈసారి మేకర్స్ భారీగా డిమాండ్ చేస్తున్నారట. తెలుగు థియేట్రికల్ రైట్స్ కోసం ఏకంగా రూ.100 కోట్లు డిమాండ్ చేస్తున్నారట. అయితే ఆ మొత్తం మరీ ఎక్కువని తెలుగు డిస్ట్రిబ్యూటర్లు అనుకుంటున్నారు. అయితే ఇది నిజమేనా.. లేక మార్కెటింగ్ హైపా అన్నది తెలియాల్సి ఉంది. ఇటీవల 'కూలీ' తెలుగు థియేట్రికల్ రైట్స్‌ని ఏషియన్ సురేష్ పాటు దిల్ రాజు భాగస్వామ్యంగా రూ.44 కోట్లతో పాటు జీఎస్టీ చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. ఇక 'వార్ 2' హక్కుల్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సూర్యదేవర నాగవంశీ రూ.80 కోట్లకు పైగా కొనుగోలు చేశారు.

# సూటిగా చెప్పా అందుకే ఈ విజయం..

దేవా కట్టా , కిరణ్ జే కుమార్ సంయుక్తంగా దర్శకత్వం వహించిన 'మయసభ' దేశవ్యాప్తంగా ఓటీటీ ప్రేక్షకులని అలరిస్తోంది. భాషా సరిహద్దుల్ని చెరిపేస్తూ అన్ని ప్రాంతాల ప్రేక్షకులను అలరిస్తోన్న ఈ వెబ్ సిరీస్ ఇప్పటికే 2.8 మిలియన్ల వ్యూస్‌తో పాన్ ఇండియా వైడ్‌గా సంచలనం సృష్టించింది. ఈ సిరీస్ 'ఓర్‌మ్యాక్ మీడియా లిస్ట్'లో టాప్ 3లో నిలవడంపై దర్శకుడు దేవా కట్టా తాజాగా స్పందించారు.



"మయసభ' ఈ ఘనత సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. దర్శకుడిగా నేను ఎదిగానని అనిపిస్తోంది. నేను చెప్పాలనుకున్న అన్ని విషయాలను ఈ వెబ్ సిరీస్ ద్వారా నిజాయతీగా చెప్పగలిగాను అనిపించింది. నేను దర్శకత్వం వహించిన 'ప్రస్థానం' మూవీ సమయంలో బ్లాక్‌బస్టర్ ఫీలింగ్ కలిగింది. మళ్లీ ఇన్నాళ్లకు 'మయసభ' ద్వారా అలాంటి ఫీలింగ్ కలుగుతోంది. దీన్ని ముందుగా వెబ్ సిరీస్‌గా తీయాలనుకోలేదు. 'గాడ్ ఫాదర్‌లా మూడు పార్టులు తీయాలనుకున్నాం. ఇద్దరు చురుకైన యువకులు తమ జీవితాన్ని ఎలా ప్రారంభించారు?.. ఎలా ఎదిగారు? అన్నది మొదటి పార్టులో, వారిద్దరు శత్రవులుగా ఎలా మారారు అన్నది రెండో పార్టులో, ఒకరిని మరొకరు నాశనం చేసేందుకు ఎలాంటి ఎత్తులు వేశారన్నది మూడో పార్టులో చూపించాలనుకున్నాం. కానీ మూడు పార్టులను రెండుగా కుదించడానికి ప్రయత్ని చాను.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,